ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
స్టేట్ విజన్
STATE VISION
మంగళవారం 18-08-2026 పేజీలు : 16

## ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై యువకుడి మృతి



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): బాలా నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

13 పేజీలో...

# రూ.50.40 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన

కుత్బుల్లాపూర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. చింతల్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో రూ.32 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, వెంకట్రాంరెడ్డి నగర్‌లో రూ.18.40 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. 2009--2014 మధ్య తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పనులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులకు నిధులు



- కాంగ్రెస్ హయాంలో కుత్బుల్లాపూర్ అభివృద్ధికి పెద్దపీట: కూన శ్రీశైలం గౌడ్
- గాంధీనగర్‌లో రూ.32 లక్షలు..
- వెంకట్రాంరెడ్డి నగర్‌లో రూ.18.40 లక్షల పనులు
- రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో మౌలిక వసతుల కల్పనకు కృషి

13 పేజీలో...

## గుడుంబా స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు



- నిద్దర పోతున్న ఆబ్కారీ ఆది కారులు.
- బెల్ట్ షాప్‌ల మామూళ్ల మాయ లో ఆబ్కారీ అధికారులు
- మండలంలో ఎస్సై మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, కిస్టాపురం,భీముని తండా తులస్య తండాలో దాడులు

తొర్రూరు ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : తొర్రూరు మండలంలో స్టిక్కర్ తో లిక్కర్ వ్యాపారం చేసుకోమని వైన్స్ షాప్ యజమానుల మాయ లో తొర్రూరు ఆబ్కారీ శాఖ అధికారులు వారిచ్చే మామూళ్ల. తో నిద్ర పోతున్న అధికారులు.

9 పేజీలో...

## మృతుడి కుటుంబానికి అండగా పొదుపు సంఘం..
## రూ.80 వేల సాయం

- అనారోగ్యంతో మృతి చెందిన సభ్యుడి భార్యకు క్లెయిమ్ మొత్తం అందజేత
- అభయనిధి, ఇన్సూరెన్స్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం

12 పేజీలో...

## యాప్ బుకింగ్ వద్దు.. పాత పద్ధతే ముద్దు

- రైతులకు శాపంగా మారిన ఎఫ్ఎఫ్ఎస్ యూరియా బుకింగ్ యాప్
- పాత పద్ధతిలోనే ఫింగర్‌ప్రింట్ ద్వారా ఎరువులు అందించాలని రైతుల విజ్ఞప్తి

10 పేజీలో...

## నాగదేవత ఆలయంలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రత్యేక పూజలు

బాచుపల్లి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): నాగుల పంచమిని పురస్కరించుకుని 127వ రంగారెడ్డి నగర్ డివిజన్ గిరినగర్‌లోని నాగదేవత ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నాగదేవత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖరగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు అమరేంద్ర చారి, భారతి, సురేష్‌తో పాటు నాయకులు క్రాంతి యాదవ్, జల్దా లక్ష్మీనాథ్, కార్తీక్ గౌడ్, ఓంకార్ రెడ్డి, సాయి, అల్లూ, రమ్మీ గౌడ్, ఉదయ్, సోనూ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ..

కుకునూరుపల్లి, ఆగష్టు 17,విజన్ ఆంధ్ర : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమం సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభం అయింది. ఎంపీడీఓ మహబూబ్ అలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు వివిధ రకాల సమస్యల గురించి అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. సోమవారం మొత్తం 28ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. ప్రజలు సమర్పించిన అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించిన అధికారులు వాటి పరిస్కారం కోసం చర్యలు తీస్కుంటామని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈఓ బచ్చలి సత్తయ్య, ఎంపిఓ గోవిందరాజు, విద్యుత్ శాఖ ఏఈ రాజేంద్ర ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 5 భూ సంబంధిత ఫిర్యాదులు

### సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక ప్రజావాణి

### - ఎంపీడీవో శాంతమ్మ




మర్పల్లి, ఆగష్టు 17 (విజన్ ఆంధ్ర): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం ఐదు భూ సంబంధిత ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో శాంతమ్మ తెలిపారు. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.ప్రతి సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.సామాన్య ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే అధికారులను నేరుగా కలిసి ఫిర్యాదులు అందించే అవకాశం కల్పించడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖ అధికారుల సమన్వయంతో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శాంతమ్మ వెల్లడించారు.

## ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

కుల్కచర్ల, ఆగస్టు, 17(విజన్ ఆంధ్ర): జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్ సూచించారు. కుల్కచర్ల మండలం పుట్టాపహాడ్ గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఉప కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు. ఉప కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ...ఇమ్యునైజేషన్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. క్షయ, కుష్టు వ్యాధులకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని తెలియజేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పురుగుల మందుల వినియోగంపై అవగాహన

### - శ్రీనిధి, రితికా, ఎస్తర్, ధృతి ఆధ్వర్యంలో సమాచార కేంద్రం ఏర్పాటు

### - భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలన్న నిర్వాహకులు

### - గ్రామ సర్పంచ్ పార్కుల రాం రెడ్డి ఆధ్వర్యంలో



చౌటకూర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర):- చౌటకూర్ మండలం కేంద్రంలో రైతులు పంటలకు పురుగుల మందులను పిచికారీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు శ్రీనిధి, రితికా, ఎస్తర్, ధృతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిగా మాట్లాడి, పురుగుల మందుల వాడకంలో పాటించాల్సిన కీలక అంశాలను వివరించారు:

భద్రతా పరికరాల వినియోగం: మందులు పిచికారీ చేసే సమయంలో మాస్కులు, గ్లౌజులు వంటి రక్షణ పరికరాలను తప్పనిసరిగా ధరించాలి.

సరైన మోతాదు ౼ లేబుల్ సూచనలు: పురుగుల మందు డబ్బాలపై ఉన్న సూచనలను చదివి, నిర్దేశించిన మోతాదులోనే వినియోగించాలి.

నిర్లక్ష్యం వద్దు: సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతుల ఆరోగ్యంతో పాటు పంటలపై, భూసారంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది.

పరిసరాల రక్షణ: మందుల డబ్బాలను పిల్లలకు అందకుండా భద్రపరచాలని, వాడిన ఖాళీ డబ్బాలు, సీసాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా సురక్షితంగా నాశనం చేయాలి.

రైతులకు అవసరమైన సలహాలు, సమాచారం అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్కుల రామ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సందీప్ గౌడ్, కుమార్ గౌడ్, గ్రామ యువకులు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఐదు శాఖల అధికారులే హాజరు..

### - మిగతా వారి గైర్హాజరుపై ఎంపీడీవో ఆవేదన



చౌటకూర్, ఆగస్టు 17: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఐదు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రజల సమస్యలను స్వీకరించి, పరిష్కరించేందుకు నిర్వహించే ఈ ముఖ్యమైన కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది.ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10:00 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా సమయానికి హాజరు కావాలని ముందస్తుగానే చరవాణి (ఫోన్) ద్వారా సమాచారం అందించినట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ ఉదయం 10:30 గంటలు దాటినా పలు శాఖల అధికారులు రాలేదు.సమయానికి ఎంపీడీవో ,ఎక్సైజ్, వ్యవసాయ, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో పాటు ఎస్సీ హాస్టల్కు చెందిన అధికారులు, ఎంపీడీవో మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు అందుబాటులో లేకపోవడంతో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి.ప్రజావాణికి అధికారులు కచ్చితంగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు దూర ప్రాంతాల నుంచి వస్తున్నప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయానికి హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# బస్తీలో శునక విహారం

### - గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

### - ఇబ్బందులు పడుతున్న స్థానికులు

### - రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే బెంబేలు

### - అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం

కడ్తల్ ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : ఆమనగల్లు పట్టణ కేంద్రంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు బయటికి రావాలంటే కుక్కల భయంతో వణికిపోతున్నారు. గతంలో పలు చోట్ల కుక్కల దాడిలో గాయపడిన వారి పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. వీధి కుక్కలు ఎక్కువగా తిరుగుతున్న ప్రదేశాల్లో నిఘా ఏర్పాటు చేసి వాటిని పట్టుకునే వారిని ఏర్పాటు చేయాలని ఇప్పటికే అనేక సార్లు అధికారులను ప్రజలు కోరినా.. మున్సిపల్ అధికారులు తమకేమిపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వారి నిర్లక్ష్య వ్యవహార ధోరణికి ప్రజలు వీధి కుక్కలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతిభ నగర్ కాలనీ, శివాలయం నగర్ కాలనీ, ఆదర్శ నగర్ కాలనీ, ఉదయ్ నగర్ కాలనీ, ప్రేమ్ నగర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, బీసీ కాలనీ, గుర్రంగుట్ట కాలనీలలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ.. స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. దూర ప్రాంతాల నుంచి రాత్రి సమయాల్లో ప్రయాణం చేసి తమ ఇండ్లకు వెళ్లే వారిపై, అత్యవసర పరిస్థితుల్లో బయటికి వస్తున్న స్థానికులపై వీధి కుక్కలు గుంపులుగా దాడులు చేస్తున్నాయి. దాడి నుంచి సగటు మనిషి తమకు ఎటువంటి హాని కలగకూడదని రాళ్లతో, కర్రలతో ప్రతిదాడి చేసినా.. పూర్తి స్థాయిలో ప్రయోజనం ఉండడం లేదు. కొంతమేరకు దాడిలో గాయాలపాలవు తున్నారు. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. తమ నిర్లక్ష్య ధోరణిని వీడి ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి వీధి కుక్కలను అరికట్టాలని, ప్రజలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

**కుక్కలను అరికట్టాలి**



ఆమనగల్లు మున్సిపాలిటీలో రోజురోజుకూ పెరిగిపోతున్న వీధికుక్కలను అరికట్టాలి. వీధి కుక్కలవల్ల అత్యవసర పరిస్థితుల్లో రాత్రి సమయాల్లో బయటికి రావాలంటే భయం వేస్తోంది. మున్సిపాలిటి పాలకవర్గం, అధికారులు వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలి.

## లింగాల ఘనపురం మండలంలో కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

లింగాల ఘనపురం ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలంలోని వడిచెర్ల, నెల్లుట్ల, సిరిపురం, జీడికల్, గుమ్మడివెల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామ కమిటీల ఏర్పాటుకు నిర్వహించిన సమావేశాల్లో మాజీ జడ్పీటీసీ సభ్యులు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గుడి వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధనవంతి ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు, కమిటీల ఎంపికపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.

ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షులు సాదం విజయ్ మనోహర్, మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్లు కొత్త కరుణాకర్ రెడ్డి, కిసర దిలీప్ రెడ్డి, కార్యదర్శులు బొల్లంపల్లి నాగేందర్, భీమా రాజు,బేబీ శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లోకుంట్ల ప్రవీణ్, సుధాకర్ రెడ్డి, సింగపురం దయాకర్, మణి, దావెర నాగరాజుతో పాటు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేసి, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.

## ఎన్నికల హామీల మేరకు తులం బంగారం ఇవ్వాలి

కళ్యాణ లక్ష్మి,షాదీముబారక్ పథకాలను అమలు చేయాలి,హామీలు అమలు చేయకుండా మాటలతో తప్పించుకోలేరు.రిపోర్టర్ పై దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు...

– మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి

భూపాలపల్లి జిల్లా అగస్టు 17 (విజన్ ఆంధ్ర ) కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బిఆర్ఎస్ మహిళా విభాగంలో చేపట్టిన భారీ ధర్నా,రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గారు..రిపోర్టర్ పై దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి పదేళ్లపాటు అమలు చేసిందన్నారు.అయితే ప్రస్తుత ప్రభుత్వం కోర్టుల్లో సరైన వాదనలు వినిపించకపోవడంతో పథకంపై ఆంక్షలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.పథకాన్ని యథావిధిగా కొనసాగించడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎకరాకు రూ.15 వేల ఆర్థిక సాయం,రైతు బీమా వంటి హామీలను కూడా అమలు చేయాలన్నారు. రైతు బీమా ప్రీమియం చెల్లించకపోవడం తో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వాన్ని విమర్శించడానికే సమయం కేటాయించకుండా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని గుర్తించాలని అన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులకు సాగునీరు, ఎరువులు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాటలతో, ఎదురుదాడులతో ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోలేదని గండ్ర హెచ్చరించారు. ఇప్పటికైనా వాస్తవాలకు దగ్గరగా పాలన సాగిస్తూ ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు.

## పరకాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు బొమ్మకంటి చంద్రమౌళి పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షులు

హనుమకొండ జిల్లా పరకాల విజన్ ఆంధ్ర ఆగస్టు 17 : ముఖ్యమంత్రివర్యులు మన ప్రియతమ నాయకులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి భారీ బహిరంగ సభను మన ప్రియతమ నాయకులు అభివృద్ధి ప్రదాత పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి సారధ్యంలో విజయవంతం చేసిన పరకాల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు ఈ చారిత్రాత్మక సభ విజయవంతం కోసం అహర్నిశలు కృషి చేసిన జిల్లా ముఖ్య నాయకులు,మండల సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచులు ఉప సర్పంచులు,వార్డు సభ్యులు, బూత్ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గ్రామ నాయకులు, కస్టర్ ఇంచార్జిలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎస్సీ ,ఎస్టీ నాయకులు కార్యకర్తలు అన్ని అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్, నాయకులు, మహిళా కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదములు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని బిఆర్ ఎస్ ఆర్మూర్ పట్టణ కమిటీ..

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ పట్టణ కేంద్రంలో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని కోరుతూ బిఆర్ఎస్ ఆర్మూర్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ ఎమ్మార్వో గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ గారు మాట్లాడుతూ ఈ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని ఆడపిల్లల వివాహ సమయంలో ఆర్థిక భారం తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను ప్రభుత్వం కొనసాగించకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు అవసరమైతే రాస్తారోకో లు ధర్నాలు నిర్వహించడం తోపాటు కలెక్టరేట్ ను ముట్టడించే కార్యక్రమాలను కూడా వెనుకాడ



బోమని సృష్టం చేశారు. పేద కుటుంబాల ఆడపిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకొని ఈ పథకాలను కొనసాగించాలని బి ఆర్ఎస్ ఆర్మూర్ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకరి రవి దొండి శ్యామ్ మీరా శ్రవణ్ మాజీ జెడ్పిటిసి సంతోష్ కౌన్సిలర్లు పృద్వి నదీమ్ నయీమ్ అజీమ్ నాయకులు కపెల్లి గణేష్ తహసీన్ సత్తార్ లతీఫ్ హర్షద్ రహమత్ సైఫ్ అంజద్ బిఆర్ఎస్ ఆర్మూర్ పట్టణ కమిటీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు..

## జోర్దార్ గ కొనసాగిన నాగుల చవితి అన్నదానం

బాల్కొండ (నిజామాబాదు ) విజన్ ఆంధ్ర ఆర్. సి.ఆగస్ట్ 17 :- "అలకొండ పురి రమ్య నగ్రె: నవబి రావృతా !తత్రేషా తు మహాదేవ శివ ప్రతిష్ఠితా!! (తొమ్మిది ఏడైనా నల్ల రాళ్ల కొండల చేత చుట్టబడి ఉన్న అందమైన బాల్కొండ నిజామాబాదు జిల్లా బాల్కొండ లో (1059) లో ఊరు మధ్యన స్వయంబుగా వెలసిన "సలిగంటి" శివ ఆలయంలో సోమవారం రోజున నాగుల చవితి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.భక్తులు ఉదయం 5:00 నుండే బారులు తీసిన భక్తులు శివునికి మొక్కులతో పాటు ఒడి బియ్యాలు సమర్పించు కున్నారు.తేదీ 06-04-1960 రోజున వేప చెట్టుతో పాటు ఆలయ పున : నిర్మాణం చేసిన తర్వాత "సలిగంటి" శివా లయంగా నామకరణం చేసినట్లు "సలిగంటి" ఆలయశ్రీ కమిటీ అధ్యక్షులు ఆరెపల్లి శ్రీనివాస్ తెలిపారు.ఇలా ప్రతి సంవత్సరశీ "నాగుల చవితి " రోజున ఊరి ప్రజలే కాకుండా చుట్టూ ప్రక్కల ప్రజలు "నాగుల చవితి " రోజు ఉదయం 6:00 నుండే "సలి గంటి" ఆలయానికి చేరుకొని పుట్టలో పాలు పోసి శివనమా స్మరణతో ఉచ్చరిస్తూ ఉంటారని గత (05) సంవత్స రాలనుండి "నాగుల చవితి " రోజున (08) క్వింటాల్ల బియ్యం తో అన్నదానం చేస్తున్నట్లు "సలిగంటి" ఆలయశ్రీ కమిటీ అధ్యక్షులు ఆరెపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొండ ఊరు (1059) ఉద్భవించినప్పుడే ఊరు మధ్య భాగంలో స్వయంబుగా వెలసిన " పెద్ద పాముపుట్ట " ఉండేదని పొద్దె రామయ్యా రోజు పుట్టలో పాలు పోస్తూ సేవ చేసుకొనే వాడని, ఒకరోజు రామయ్యకు శివుడు ప్రత్యక్షమై నా మెడలో ఉండే నాగసర్పం ఇదే పుట్టలో ఉందని తాను " సలిగంటయ్యగా " వేప చెట్టు కింద వెలుస్తున్నానని ఊరిలో ఎవరికైనా పాము కాటుకు గురైతే నా సన్నిధికి తీసుకువచ్చి పుట్ట పై వెలిసిన వేప చెట్టు ఆకుల పసరు నోటిలో పోస్తే తాను ప్రాణ గండం నుండి రక్షిస్తానని అభయం ఇవ్వడంతో పూర్వ పెద్దమనుషులు "సలిగంటి" ఆలయంగా నామకరణం చేసినట్లుగ పైగా పూర్వ రోజుల్లో ఊరికి చెందిన రాజన్న అనే వ్యక్తి "నాగుల చవితి రోజున" పొలంలో వ్యవసా యం చేసుకొంటి ఉ ఒడగా అకస్మత్తుగా పాము కాటుకు గురై పోవడంతో రాజన్న అనే వ్యక్తిని " సలిగంటి ఆలయానికి తీసుక వచ్చి పుట్టపై పెరిగిన వేపచెట్టు ఆకుల పసరు చేసి రాజన్న నోట్లో వేసిన తర్వాత కొద్దిసేపటికి రాజన్న" స్పృహా" లోకి వచ్చాడని ఇదే విష యాన్ని గ్రామానికి చెందిన శ్రీ శ్రీ శ్రీ శంకరం పంతులు మాకు చెప్పడం జరిగిందని శ్రీశ్రీశ్రీ మాజీ జోషి మారుతి జోషి ద్వారా తెలిసింది.ఇంతే కాకుండా ఈ ఆలయానికి పుత్ర,పౌత్ర సంతానశీ తో పాటు కుటుంబం ఆయు: ఆరోగ్యంగా ఉండాలని ఎవరైనా మొక్కుకుంటే తప్పకుండా వారి కోరికలు "సలిగంటి" శివుడు తీరుస్తాడని నమ్మకం ఉంది.ఎంతో ప్రాముఖ్యత గల "సలి గంటి" శివాలయ విశిష్ట చరిత్ర విషయాన్ని బాల్కొండ గ్రామానికి చెందిన బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు రచించిన " అల్లకొండ ఊరు ఉద్భవం – ఐదు ఆల యాల ప్రసిద్ధి " పుస్తకములో వివరించినట్లు మాజీ వి.డి.సి అధ్యక్షులు పోతరాజు వివరించారు.ఇది ఇలా ఉండగా ఆలయ పునర్ నిర్మాణం లో భాగంగా తేదీ 06-04-1960 రోజున వేప చెట్టుతో పాటు ఆలయ పున : నిర్మాణం చేసిన తర్వాత "సలిగంటి" శివా లయంగా నామకరణం చేసినట్లు "సలిగంటి" ఆలయశ్రీ కమిటీ అధ్యక్షులు ఆరెపల్లి శ్రీనివాస్ తెలిపారు.ఇలా ప్రతి సంవత్సరశీ "నాగుల చవితి " రోజున ఊరి ప్రజలే కాకుండా చుట్టూ ప్రక్కల ప్రజలు "నాగుల చవితి " రోజు ఉదయం 6:00 నుండే "సలి గంటి" ఆలయానికి చేరుకొని పుట్టలో పాలు పోసి శివనమా స్మరణతో ఉచ్చరిస్తూ ఉంటారని గత (05) సంవత్స రాలనుండి "నాగుల చవితి " రోజున (08) క్వింటాల్ల బియ్యం తో అన్నదానం చేస్తున్నట్లు "సలిగంటి" ఆలయశ్రీ కమిటీ అధ్యక్షులు ఆరెపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ఒకే సరళరేఖపై " ఓంకార రూపంలో " ప్రజ్వరిలుతున్న బాల్కొండ పూర్వం అల్లకుండా బాల్కొండ లో మూడు ఆలయాలు ఒకే సరళరేఖ పై ఓంకార రూపంలో వెలిశాయి ఇందులో భాగంగా బాల్కొండకు దక్షిణ భాగంలో ఎత్తైన కొండని ఆనుకొని "ఓం" కార ప్రారంభ మలుపు గీతలో శ్రీ నిమిషంభ దేవి ఆలయం (శివుడి భార్య అయిన పార్వతి దేవి ప్రతి రూపఆలయం) "ఓం" కార మధ్యస్థలి లో "సలిగంటి" శివ ఆలయంగా

ఉంది. ఇక పోతే "ఓం" కార చివరి మలుపు 80 మీటర్ల వ్యవధి దూరంలో శ్రీ శ్రీ హారా చారి నారాయణ స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ లలితా దేవి ఆశ్రమం ఉండటం విశేషం.ఇలా పై మూడు ఆలయాలు ఒకే సరళ రేఖ దిశలో ఓంకారం లో సృష్టి, లయ, తో పాటు శివపార్వతుల సంఘంమే అవుతుంది.

# సంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎం. అంబదాస్



సదాశివపేట: విజన్ ఆంధ్ర: భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడుగా ఎం. అంబదాసు నియమితులు య్యారు. ఈ సందర్భంగా సోమవారం అంబదాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నా నియా మకానికి సహకరించిన ఓ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కొంఐం విట్టల్, పార్టీ జిల్లా రథసారథి గోదావరి అంజిరెడ్డి ,మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ,పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్పాండే గార్లకు, జిల్లాలో ఉన్న సీనియర్ నాయకులు అందరికీ పేరుపేరునా శుభాభినందనలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎక్కడ వమ్ముకానీయకుండా సంగారెడ్డి జిల్లాలో ఓబీసీ మోర్చా బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానని గ్రామ గ్రామాన ఓ బీసీలను వారి సమస్యలను జిల్లా పార్టీకి తెలియజేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకువెళ్ళి పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతానని నా నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## తానూర్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై బీఆర్ఎస్ ధర్నా

తానూర్, ఆగస్టు 17: విజన్ ఆంధ్ర : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకురాలు డా. పడకంటి రమాదేవి ఆధ్వర్యంలో తానూర్‌లో ధర్నా నిర్వహించారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాల ద్వారా లబ్ధి పొందాల్సిన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాల ప్రయోజనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇదిలా ఉండగా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెల్లింపులపై తెలంగాణ హైకోర్టు ఇటీవల మధ్యంతర స్టే విధించిన విషయం తెలిసిందే. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు చెల్లింపులు నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది.

## హుస్నాబాద్ జామా మజీద్ లో ఉచిత కంటి వైద్య శిబిరం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 17 :సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మాజీ పురపాలక సంఘ చైర్ పర్సన్ కౌన్సిలర్ ఆకుల రజిత వెంకన్న ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ వరంగల్ వారి సహకారంతో స్థానిక జామా మజీద్ లో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. 15వ వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుల రజిత మాట్లాడుతూ శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఇలాంటి శిబిరాలు చాలా ఉపయోగకరమని పేదలకు దూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి వయోవృద్ధులకు షుగర్ పేషెంట్లకు దృష్టిలోపం ఉన్నవారికి ఇలాంటివి ఎంతో ఉపయోగకరమన్నారు. ఇలాంటి క్యాంపులు నిర్వహించడం ప్రజలకు చాలా ఉపయోగకరమన్నారు. ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహణ కోసం సహకరించిన కౌన్సిలర్ కి మరియు శరత్ మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్ సిబ్బందికి మరియు జామా మసీదు కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామా మజీద్ అధ్యక్షులు మొహమ్మద్ భాష మియా ప్రధాన కార్యదర్శి హసన్ ఎండి అయూబ్ మొహమ్మద్ మొహమ్మద్ ఫసియుద్దీన్ మొహమ్మద్ ముంతాజ్ మొహమ్మద్ రూహల్ అమీన్, యున్సూస్ సయ్యద్ పాష, సయ్యద్ ఇంతియాజ్ అఫ్సర్ అంజద్ అఫ్జల్ పాషా రఫీ సందీప్ అనూష సదానందం మహిళా సోదరీమణులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆంధ్రజ్యోతి' ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరావుకు రాష్ట్ర స్థాయి అవార్డు

**-ప్రజా సమస్యలు, పేదల జీవన చిత్రాలకు దక్కిన గుర్తింపు**

**- 'న్యూస్ ఫొటో కాంపిటీషన్--2026'లో ప్రతిభకు పురస్కారం**

**-ఫుట్‌పాత్‌పై జీవనం సాగించే కుటుంబం కష్టాలను కళ్లకు కట్టిన చిత్రం**

**-సమాజానికి ఉపయోగపడే కథనాలకు మరింత ప్రాధాన్యమిస్తా: నాగేశ్వరావు**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 17: (విజన్ ఆంధ్ర); ప్రజా సమస్యలను, సామాన్యుల జీవన పోరాటాలను తన కెమెరా కంటితో సమాజానికి పరిచయం చేస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరావుకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'న్యూస్ ఫొటో కాంపిటీషన్--2026'లో ఆయన తీసిన ఛాయాచిత్రానికి రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తూ ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్న ఓ కుటుంబం జీవితాన్ని ప్రతిబింబించేలా నాగేశ్వరావు చిత్రీకరించిన ఫొటోకు ఈ అవార్డు దక్కింది. ఆర్థిక ఇబ్బందులు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తమ పిల్లలను రాజుల్లా పెంచాలనే తల్లిదండ్రుల తపనను ఆ ఛాయాచిత్రం ప్రతిబింబించింది. ఫోటో జర్నలిజం ద్వారా కేవలం సంఘటనలను నమోదు చేయడమే కాకుండా.. సమాజంలోని సమస్యలు, సామాన్యుల కష్టాలు, మానవీయ విలువలను వెలుగులోకి తీసుకురావడమే తన లక్ష్యమని నాగేశ్వరావు తెలిపారు. తన ఫొటో రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక కావడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. సమాజానికి ఉపయోగపడే ప్రజా సమస్యల కథనాలకు భవిష్యత్తులోనూ మరింత ప్రాధాన్యం ఇస్తానని ఆయన చెప్పారు. తన ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్ నిర్వాహకులకు నాగేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల జీవితాల్లోని వెలుగునీ.. చీకటినీ కెమెరాలో బంధించి సమాజం ముందుకు తీసుకురావడమే నిజమైన ఫోటో జర్నలిజమని నిరూపించేలా ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని ఆయన పేర్కొన్నారు.

## మానవత్వం చాటుకున్న కుటుంబం



ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ నిజామాబాదు ఆగస్ట్ 17: నేటి కలి కాల ప్రభావంలో సమాజంలో తల్లిదండ్రులను సొంత పిల్లలే పట్టించుకోని పరిస్థితులు,ఎవరూ కన్న దండ్రులు ఎవరూ పుత్రులు అంతా నా ఇష్టం అనే రోజులు ఇవి అలాంటిది ఒక కుటుంబాన్ని చివరి శ్వాస వరకు కంటికి రెప్పలా కాపాడిన ఇంటి దిక్కు చని పోతే ఆ కుటుంబ క్షోభ వర్ణానా తీరం ఓ శునకం ఆత్మకు శాంతిని చేకూర్చాలనే శంకల్పంతో అనాథ పిల్లలకు అన్నదానం చేసిన యజమానుల సంఘటన గురించి వెలిగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఆర్మూర్ పట్టణానికి చెందిన ఓ కుటుంబం గత రెండున్నర సంవత్సరాలుగా"లక్కీ"అనే శునకాన్ని సొంత బిడ్డల అల్లారు ముద్దుగా పెంచుకు న్నారు. ఇంటి సభ్యుడిగా చూసుకున్న లక్కీ అనారోగ్యం పాలు కావడంతో ఆసుపత్రుల్లో చూపించిన నయం కాలేదు. ఈనెల 8న మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీర య్యింది. లక్కీ ఆత్మకు శాంతి చేకూరాలని మృతి చెందిన తొమ్మిదవ రోజున ఆర్మూర్ పట్టణంలోని తపస్వి అనాథ ఆశ్రమంలోని పిల్లలకు లక్కీ యజమానులు ఆదివారం అన్నదానం చేశారు. దాని పేరుతో ఏదో ఒక మంచి పని చేయాలని తపించి అన్నదానం చేశామని లక్కీ యజమానులు భావోద్వేగంతో తెలిపారు. లక్కీ నేర్పిన ప్రేమ, నమ్మకం ఎప్పటికీ మరిచిపోలేమని, అది ఎక్కడున్నా దాని ఆశీర్వాదం, దీవెనలు సదా మాతో ఉంటాయని కంటతడి పెట్టారు. డబ్బు, స్వార్థం, పదవుల కోసం మనుషులు మనుషులను మర్చిపోతున్న ఈ రోజుల్లో ఒక శునకం కోసం అనాధలకు అన్నదానం చేయడం చూసి స్థానికులు, అనాధాశ్రమం సిబ్బంది ఆ కుటుంబాన్ని అభినందించారు.

## హుస్నాబాద్ లో దారుణం

**భర్తపై భార్య రోకలిబండతో దాడి చేసి హత్య ఆస్తి వివాదాలే హత్యకు కారణం**



హుస్నాబాద్ ఆగస్టు 17 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ఐదవ వార్డు హనుమాన్ నగర్ ప్రాంతంలో దారుణ సంఘటన జరిగింది ఈ సందర్భంగా వివరాల్లోకి వెళితే కోటి వెంకటేశ్వర్లు వయస్సు 62,అతను ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ లో అసిస్టెంట్ కమర్షియల్ టెక్స్ ఆఫీసర్, అతని భార్య రాజమణి హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్ఎం గా పనిచేస్తుంది ఇద్దరు విద్యావంతులే ఉద్యోగస్తులే కానీ ఆస్తి వివాదం ఒకరి ప్రాణాలు బలి తీసుకున్నది. ఈ సందర్భంగా కోటి వెంకటేశ్వర్లు మొదటి భార్య రాజమణి ఉండగా రెండో భార్యను కూడా వివాహం చేసుకున్నాడు. ఈనెల 30వ తేదీన అతను పదవి విరమణచేయనున్నాడు తనకు ప్రభుత్వం నుంచి వచ్చే తన ఆర్థిక లావాదేవీల విషయంలో రెండో భార్య పేరునమోదు చేయించడంతో తరచూ మొదటి భార్య రాజమౌళికి అతనికి గొడవలు ప్రారంభమయ్యాయి దీంతో సోమవారం రాత్రికూడా గొడవ జరిగింది. ఆవేశంతో మొదటి భార్య రాజమణి భర్త వెంకటేశ్వర్లుకు ఆస్తి పంపకం విషయంలో తీవ్రంగా వాగ్వాదం జరిగినట్లు ఈ సమయంలో ఆవేశంలతో భార్య రాజమణి రోకలిబండతో భర్తను కొట్టడంతో అతను తీవ్ర గాయాల పాలయ్యాడు వెంటనే కుటుంబ సభ్యులు స్పందించి కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మార్గమధ్యంలోనే చనిపోయాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హుస్నాబాద్ పోలీసులు కేసులు నమోదు చేసుకొని శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం కోసం తరలించారు జరిగిన హత్యపై కేసు నమోదు చేశారు. మొదటి భార్యను అదుపులోకి తీసుకోని విచారణ ప్రారంభించారు. ఈ సంఘటనపై పట్టణంలో తీవ్ర కలకలం సృష్టించింది.

## పరకాల పాలిటెక్నిక్ ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

**-ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్**

హనుమకొండ జిల్లా పరకాల విజన్ ఆంధ్ర ఆగస్టు 17: ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరకాల పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ధర్నా నిర్వహించడం జరిగింది ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ శక్తి పాలసీ వెనక్కి తీసుకోవాలి నాదీజు బోర్డును అభివృద్ధి చేయాలి. హాస్టల్ ల్యాబ్స్ భవనాలు నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలి.
పాలిటెక్నిక్ అధ్యాపకులు సిబ్బంది సర్వీస్ నిబంధనకు రక్షణ కల్పించాలి
పాలిటెక్నిక్ కాలేజీలను YISUలో విలీనం చేసే ఉద్దేశం లేదని స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొచ్చు ఈశ్వర్ పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్ నాగరాజ్ అభినవ్ విద్యార్థులు పాల్గొన్నారు



# ఘనంగా నాగుల పంచమి వేడుకలు

## - పుట్టలో పాలుపోస్తున్న డిప్యుటీ మేయర్ సల్ల రమ్య

మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 17,(విజన్ ఆంధ్ర ) : నాగుల పంచమి పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ఎఫ్ సి ఏ గోదాం సమీపంలో గల శ్రీ సప్త శిరస్సు నాగదేవత ఆలయంలో భక్తులు పుట్టలో పలుపొసి, పూజలు చేశారు.ఉదయం నుండి మహిళలు ఆలయంలో బారులు తీరారు.ఆలయ అర్చకులు ఎడ్ల బాలయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ నాగదేవత ఆలయంలో పూజలు చేశారు. పుట్టలో పాలుపొసి మొక్కులు చెల్లించారు.అనంతరం ఆలయం వద్ద నడివెల రాజేశం సరోజ దంపతులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమం లో దొడ్డిపట్ల కృష్ణ, గుంట మల్లేష్,బోరె సురేష్,దబ్బెట శ్రీకాంత్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చౌటకూర్ మండలంలో ఘనంగా నాగులచవితి వేడుకలు

చౌటకూర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చౌటకూర్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నాగదేవతకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు, చిన్నారులు కుటుంబ సమేతంగా నాగదేవత ఆలయాలు, నాగులగుట్టలు, పుట్టల వద్దకు చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాలు, పండ్లు, పుష్పాలు, చలిమిడి తదితర నైవేద్యాలను సమర్పించి నాగదేవతను భక్తితో ఆరాధించారు.

ఆయురారోగ్యాలు, పాడిపంటల కోసం ప్రత్యేక ప్రార్థనలు:

కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి నాగదేవతకు అభిషేకాలు నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయాల వద్ద ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తి వాతావరణంతో నిండిపోయాయి. ప్రకృతిని, జీవజాలాన్ని గౌరవించాలనే విశిష్ట సందేశాన్ని చాటుతూ మండల ప్రజలు నాగులచవితి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

## వైభవంగా నాగపంచమి వేడుకలు...

బోధన్, ఆగష్టు 17(విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని ఏకచక్రనగర్‌లో గల శ్రీ సంతాన నాగమ్మ ఆలయంలో నాగపంచమి, గరుడ పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ, ఫ్లోర్ లీడర్ శరత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, వార్డు కౌన్సిలర్ గుమ్ముల అశోక్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ ప్రజలకు నాగపంచమి, గరుడ పంచమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు ఆలయానికి తరలివచ్చి నాగదేవతకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



# ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పనిచేసిన కాంగ్రెస్ నేతలకు ఘన సన్మానం

**భూపతిరెడ్డి ఆధ్వర్యంలో బీఎల్ఏలు, సీనియర్ నాయకులకు సన్మానం**

**నూతన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు**




కుత్బుల్లాపూర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు నిర్వహించిన ూ×=--2026 కార్యక్రమంలో విశేషంగా పనిచేసిన పేట్ బషీరాబాద్, కుత్బుల్లాపూర్, గణేష్‌నగర్, పద్మనగర్ డివిజన్‌ల కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, సీనియర్ నాయకులను నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్లతో కలిసి మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల బీఎల్ఏలు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ూ×= కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ భూపతిరెడ్డి శుభాభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా పార్టీ శ్రేణులు నిబద్ధతతో పనిచేస్తూ నూతన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఎగవేతలు, కోతలు కూల్చివేతలు

**-హుస్నాబాద్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం**

**-కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఫీజు రీయింబర్ మెంట్ పథకాలు కావాలనే నిలుపుదల చేస్తున్నారు**

**- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**



సిద్దిపేట : జిల్లా హుస్నాబాద్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఎగవేతలు,కోతలు, కూల్చివేతలు అని అన్నారు.నిన్న ఫీజురీయంబర్స్‌మెంట్, నేడు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్,మొన్న లక్షలాది మంది తెలంగాణ విద్యార్థుల భవిష్యత్‌ను ఆగం చేసిందన్నారు.నేడు వేలాది ఆడబిడ్డల జీవితాలకు అన్యాయం చేసే ప్రయత్నం కాంగ్రెస్ సర్కారు చేస్తోందని ఆరోపించారు.కేసీఆర్ పేదల కన్నీళ్లు తుడిచేందుకు పథకాలు అమలు చేస్తే కాంగ్రెస్ సర్కారు ప్రజలను కష్టాలపాలు చేసేందుకు పథకాలను కోత విధిస్తుందన్నారు.కేసీఆర్ పథకాలు అమలు చేస్తే కాంగ్రెస్ సర్కారు హామీలకే పరిమితమైందని,ఎవరో అడ్వకేట్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారని,ఈ కాంగ్రెస్ ప్రభుత్వం జులై 8 నుంచి ఆగస్టు 7 వరకు కౌంటర్ దాఖలు చేయలేదన్నారు.ఇప్పుడు కోర్టు కళ్యాణలక్ష్మి పథకాన్ని అమలును హైకోర్టు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేసిందని,కళ్యాణ లక్షి పథకాన్ని చట్టబద్ధతత లేదు, కేవలం జీవోల మీద అమలు చేస్తున్నారని అంటున్నారన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 15-3, ఆర్టికల్ 21 ప్రకారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం చట్టబద్ధమైనదేనని,

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కేసీఆర్ గారు గొప్ప హృదయంతో ప్రవేశపెట్టారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదట 51 వేలు తర్వాత 75 వేలు, నేడు 1,00,116 ఇవ్వడం జరిగిందని,కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 10 లక్షల మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం అందించడం జరిగిందన్నారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 1,00,116తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి దాదాపు 34 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో ఏ ఒక్కరికి బంగారం ఇవ్వలేదన్నారు. 420 హామీలు,6 గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థులకు ఇచ్చే ఫీజుల రీయంబర్సమెంట్ పథకాన్ని ప్రభుత్వం ఆపివేసిందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని నిలిపి వేసే కుట్ర చేస్తుందని,పేదల తరపున బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎండి వాహెబ్ అన్వర్, కౌన్సిలర్లు గాదెపాక రవీందర్, వాలా సుప్రజ,బోల్లి శ్రీనివాస్, గడిపే సంపత్, బిఆర్ఎస్ నాయకులు ఎడబోయిన తిరుపతిరెడ్డి గద్దల రమేష్, కాశబోయిన సాంబరాజు, అయిలేని మల్లికార్జున్ రెడ్డి, సుద్దాల చంద్రయ్య, అలుమల్ల ప్రభాకర్ రెడ్డి,,బోజు రవీందర్,యాస శ్రీనివాస్, భూక్యా రాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి గ్రాండ్ వెల్కమ్.

**- భారీగా తరలి వచ్చిన బీఆర్ఆర్ నాయకులు**

**- అడుగడుగునా పైలెట్ కు నేతల అభిమానుల నీరాజనం**

**- పైలెట్ కు ప్రజల్లో తగ్గని క్రేజ్..**

**- నేతలు, అభిమానులకు అభివాదం చేసిన పైలట్**



తాండూరు, ఆగస్టు 17: మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి చాలా గ్యాప్ తరువాత తాండూరు రీ ఎంట్రీ ఇచ్చిన రోహిత్ రెడ్డికి స్థానిక నేతలు, కార్యకర్తలు అభిమానులు ఘన స్వాగతం పలికారు. సోమవారం తాండూరుకు వచ్చిన పైలెట్ రోహిత్ రెడ్డికి గులాబీ నేతలు, కార్యకర్తలు అడుగడుగునా నీరాజనం పలికారు. తాండూరుకు వస్తూ రోహిత్ రెడ్డి అనంత గిరి పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. అక్కడ ఆయనకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో ఘనంగా సన్మానించారు. అక్కడి నుంచి రాజీవ్ కాలనీ వద్ద రోహిత్ రెడ్డి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. తాండూరు పట్టణంలోని విలియం మూన్ చౌరస్తా వద్ద తాండూరు బీఆర్ఎస్ నాయకులు రోహిత్ రెడ్డికి భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు పైలెట్ చేతికి గదను బహుకరించారు. రోహిత్ రెడ్డి కోసం తరలి వచ్చిన గులాబీ నేతలతో విలేమున్ చౌరస్తా జన సంద్రంగా మారింది. రోహిత్ రెడ్డికి నేతలు, కార్యకర్తలు భారీ గజ మాల వేసి తాండూరుకు గ్రాండ్ వెల్ కమ్ పలికారు. అక్కడి నుంచి నివాసం వరకు నడుచుకుంటూ జేజేలు పలుకుతూ వచ్చారు. నేతలు, కార్యకర్తలు చూపిన అభిమానానికి రోహిత్ రెడ్డి అభివాదం తెలిపారు..

# కళ్యాణలక్ష్మికి కత్తెరా?

- పేదల పథకాలపై స్టే.. కౌంటర్ వేయడంలో సర్కారు జాప్యం!
- హామీల అమలులో చేతులెత్తేసిన కాంగ్రెస్: కేపీ వివేకానంద్ ధ్వజం
- తులం బంగారం హామీ ఏమైంది? ప్రజలకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి
- సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజాగ్రహమే గుణపాఠం: బీఆర్ఎస్ హెచ్చరిక

కుత్బుల్లాపూర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): పేదింటి ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మండిపడ్డారు. హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కౌంటర్ దాఖలు చేసి పథకాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో విఫలమైందని విమర్శించారు.

"తులం బంగారం ఏమైంది?"

కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని ఎందుకు అమలు చేయడం లేదని కేపీ వివేకానంద్ ప్రశ్నించారు. పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ల కోసం పలుమార్లు దరఖాస్తులు తీసుకుంటూ అర్హులైన వారికి మంజూరు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో అమలైన పలు సంక్షేమ పథకాలను కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.

ప్రజలపై భారం.. హామీలపై మౌనం

రైతులు, మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. విద్యుత్, తాగునీరు, సంక్షేమ పథకాల విషయంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తే పాలనాపరమైన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్, కేటీఆర్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు.

"కౌంటర్ వేయండి.. పథకాలు కొనసాగించండి"

హైకోర్టు స్టేపై ప్రభుత్వం వెంటనే కౌంటర్ దాఖలు చేసి పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కేపీ వివేకానంద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్లక్ష్య వైఖరిని మార్చుకోకపోతే ప్రజల పక్షాన బీఆర్ఎస్ మరింత ఉధృతంగా పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సంక్షేమాన్ని విస్మరిస్తే రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి వేడుకలు

బోథ్. ఆగస్టు 17. (విజన్ ఆంధ్ర) నాగుల చవితి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం తెల్లవారు జాము నుండే పుట్టలలో పాలు పోసి నాగ దేవతకు పూజలు చేసి ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. నాగ దేవతకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. బోథ్ మండల వ్యాప్తంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దులో ఉన్న నింగిని గ్రామ సమీపాన ఉన్న కైలాష్ టెకిడి ఆలయానికి భక్తులు పోటెత్తారు. జన్మరాశి లో రాహువు, కేతువు ఉన్నవారు సర్పదోష నివారణకు ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. నాగుల చవితి వేడుక సందర్భంగా గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## లోటాస్ పరిశ్రమ నుండి చెత్త చెరువులో డంపింగ్



విజన్ ఆంధ్ర హత్నూర : హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామ శివారులో గల లోటాస్ పరిశ్రమ నుండి చెత్తలో స్వీకరించి నిబంధనలకు విరుద్ధంగా చెరువులు డంపు చేస్తున్నారని నస్తీపూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు లోటాస్ పరిశ్రమ నుంచి పంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ చెత్త డాక్టర్ ద్వారా తరలించి స్థానికంగా ఉన్న చెరువులో వేస్తున్నారు అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు పరిశ్రమ యజమాన్యంతో పంచాయతీ నెలవారిగా డబ్బులు తీసుకుంటూ చెత్తలో తరలించేందుకు ఒప్పందం గురించి ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పరిశ్రమలకు చెత్త వలన నస్తీపూర్ గ్రామస్తులు అనారోగ్యం పాలు అవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశ్రమపై తగిన చర్యలు తీసుకోవాలని నస్తీపూర్ గ్రామస్తులు కోరుతున్నారు

## కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం...

బోధన్, ఆగష్టు 17(విజన్ ఆంధ్ర): బోధన్ మండలంలోని పెంటకుర్దు క్యాంపు గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంట గంగాధర్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆధునిక విద్యలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విద్యను విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో 100 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ప్రభుత్వం కంప్యూటర్ ల్యాబ్‌లను మంజూరు చేసిందన్నారు. ఈ కంప్యూటర్ల ద్వారా విద్యార్థులు సులభంగా నేర్చుకుని ఉత్తమ ప్రతిభ కనబరచాలని, నేటి ఆధునిక యుగంలో కంప్యూటర్ విద్య అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాలను నిర్దేశించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను సర్పంచ్ రాధిక సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ కృష్ణకుమారి, పాక్స్ చైర్మన్ అమర్నాథ్ బాబు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రత్నాకర్ లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, రజిని, అనురాధ, ప్రేమ్‌కుమార్, వాసు, సాయిరాం, పిఆర్టియు అధ్యక్షులు థామస్, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి అమలు చేయాలి..

**పేదింటి ఆడబిడ్డల పెళ్లి కల నెరవేర్చాలి-దుర్గం చిన్నయ్య**

బెల్లంపల్లి ఆగస్టు 17 విజన్ ఆంధ్ర : కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునఃప్రారంభించి పేదింటి ఆడబిడ్డల పెళ్లి కలను నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని కంట చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ పేద కుటుంబాలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా యథావిధిగా అమలు చేయాలని కోరారు. పేదింటి ఆడబిడ్డ వివాహం తల్లిదండ్రులకు ఎంతో ముఖ్యమైన విషయమని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది పథకం అమలులో జాప్యం చేయడం వల్ల పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చి



వెంటనే నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. పేదల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ప్రజల తరఫున మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు

ధర్నాలో బీఆర్ఎస్ పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు , పాల్గొన్నారు.

## ధర్మారెడ్డిపల్లి రైల్వే బ్రిడ్జి రోడ్డును వెంటనే మరమ్మతు చేయాలి

– బిజెపి గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్ డిమాండ్

గజ్వేల్, 17 ఆగస్టు 2026 (విజన్ ఆంధ్ర): సిద్దిపేట జిల్లా గజ్వేల్ నుండి చేగుంట వెళ్లే ప్రధాన రహదారిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామ రైల్వే బ్రిడ్జి కింద రోడ్డు పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారిందని బిజెపి గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మారెడ్డిపల్లి రైల్వే బ్రిడ్జి కింద మరోసారి భారీ గుంతలు ఏర్పడ్డాయని, సిమెంట్ కాంక్రీట్ రోడ్డు దెబ్బతిని ఇనుప రాడ్లు పైకి తేలాయని పేర్కొన్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రధాన మార్గంలో తేలిన ఇనుప రాడ్ల వల్ల వాహనాల టైర్లు పగిలిపోవడమే కాకుండా, ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి తీవ్ర ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. గతంలో తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ, సరైన నాణ్యత లేకపోవడం వల్ల మళ్లీ రోడ్డు ఛిద్రమైందని



విమర్శించారు. ఇప్పటికైనా రోడ్లు మరియు భవనాల శాఖ, రైల్వే శాఖల అధికారులు సమన్వయంతో తక్షణమే స్పందించి, ఎటువంటి ప్రాణనష్టం జరగకముందే యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి కింద రోడ్డును శాశ్వతంగా బాగు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల భద్రత కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

### చెట్టును ఢీకొన్న కారు..

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

చేవెళ్ల, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుడిపూడి హరీష్ (38) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నార్సింగి, గండిపేట్ పరిధిలోని మై హోమ్ అవతార్‌లో నివసించే హరీష్ రామన్నగూడకు హ్యుందాయ్ క్రెటా కారులో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కారును ఏలిపాటి కావ్య (35) నడుపుతుండగా హరీష్ ముందు ఎడమవైపు సీటులో కూర్చున్నాడు. కారు వేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతో అదుపుతప్పి రహదారి ఎడమవైపున ఉన్న చెట్టును ఢీకొన్నట్లు మృతుడి తండ్రి గుడిపూడి వెంకటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. హరీష్‌కు తలపై తీవ్ర గాయం, రెండు కాళ్లకు గాయాలు, ఛాతీ భాగంలో బలమైన గాయం కావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కారును నడుపుతున్న కావ్యకు కూడా తలకు తీవ్ర గాయమైనట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుంది

లిఅధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్‌లి బోథ్. ఆగస్టు 17. (విజన్ ఆంధ్ర) ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన శ్రీ సద్గురు శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మొదట శబరిమాత ఆశ్రమంలో అమ్మవారిని, అఖండ జ్యోతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం శబరిమాత భక్తులు పెద్ద సంఖ్యలో అఖండ జ్యోతి కార్యక్రమంలో పాల్గొంటూ, మన ప్రాంత ప్రజలు భక్తి మార్గంలో నడవడానికి, ధర్మం వైపు పయనించడానికి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఇందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటే భక్తి మార్గమే సరైన మార్గమని బలరాం జాదవ్ అన్నారు. రాబోయే రోజుల్లో భక్తి, ధర్మం, సత్యం ఆధారంగా దేశం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల అనిత, ఉప సర్పంచ్ కుమ్మరి మల్లయ్య, మరియు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోథ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

బోథ్. ఆగస్టు 17. (విజన్ ఆంధ్ర) బోథ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని స్థానిక పరిచయ గార్డెన్ లో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దాసరి పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి వంశీ, గౌరవ అధ్యక్షుడిగా నమలికొండ సంతోష్ కుమార్ శర్మ , సలహాదారులుగా ఈర్ల గంగాధర్, దేవిదాస్ రాథోడ్, సాయిని గంగాధర్ లు ఎన్నికయ్యారు. సభ్యులుగా సూది నరేష్, బోనగిరి కార్తీక్, సింగం నందికేశ్వర్, షేక్ అలీ, గొడిసెల రమణ గౌడ్,లింగంపల్లి సంతోష్, మునిగేల శ్రీధర్, మోహన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా నూతన కమిటీ సభ్యులను పలువురు శాలువాలతో సన్మానించారు.



# పర్యావరణ పరిరక్షణకు.. నిబంధనల అమలుకు కఠిన చర్యలు!

➡ పాత దేవుళ్ల పటాలు, విగ్రహాల కోసం 'డివైన్ వేస్ట్ కలెక్షన్ డ్రైవ్'

➡ ఆగస్టు 22న చిత్తారమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక సేకరణ

➡ అనధికార పోస్టర్లు, వాల్ రైటింగ్స్‌పై ఆగస్టు 15 నుంచి నిషేధం

➡ ఉల్లంఘిస్తే జరిమానాలు.. చట్టపరమైన చర్యలు తప్పవు: ఉప కమిషనర్ యు. వెంకట్రాములు

గాజులరామారం, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజా ప్రదేశాల సౌందర్యాన్ని కాపాడేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) గాజులరామారం సర్కిల్ పరిధిలో ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. పాతబడిన దేవుళ్ల పటాలు, పగిలిన లేదా విరిగిన విగ్రహాలు, వినియోగించిన పూజా సామగ్రిని చెరువులు, సరస్సులు, కాలువలు, ఇతర జలవనరులు, చెత్తకుప్పల్లో పడవేయకుండా గౌరవప్రదంగా సేకరించి పర్యావరణహిత పద్ధతిలో పునర్వినియోగం, రీసైక్లింగ్ చేసేందుకు ఈ నెల 22వ తేదీ శనివారం కుత్బుల్లాపూర్ జోన్ గాజులరామారం సర్కిల్ పరిధిలోని చిత్తారమ్మ తల్లి దేవస్థానంలో 'డివైన్ వేస్ట్ కలెక్షన్ డ్రైవ్' నిర్వహించనున్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న పాత దేవతా చిత్రపటాలు, పగిలిన విగ్రహాలు, ఉపయోగించిన పూజా సామగ్రిని కార్యక్రమంలో అందించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ యు. వెంకట్రాములు కోరారు.



ఇదే సమయంలో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై అనధికారిక పోస్టర్లు, బ్యానర్లు, వాల్ రైటింగ్స్, కటౌట్లు, ఫ్లెక్సీల ఏర్పాటును అరికట్టేందుకు జవీజ కఠిన చర్యలు చేపట్టింది. ఆగస్టు 15, 2026 నుంచి అనుమతి లేని వాల్ పోస్టర్లు, రాతలు తదితర అనధికార ప్రచారాలపై సంపూర్ణ నిషేధం అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భవనాలు, పార్కులు, పాఠశాలలు, ఆసుపత్రులు, ఫ్లైఓవర్లు, వంతెనలు, మెట్రో పిల్లర్లు, చెరువులు, ట్రాఫిక్ ఐలాండ్లు, వారసత్వ కట్టడాలు తదితర ప్రాంతాలను అనధికార ప్రకటనల నుంచి రక్షించేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించి పోస్టర్లు, వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసే వారిపై జరిమానాలతో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఉప కమిషనర్ యు. వెంకట్రాములు హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులు, సంస్థలు నిబంధనలు పాటిస్తూ నగర పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ప్రదేశాల సౌందర్యాన్ని కాపాడేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్లాస్టిక్‌కు నో.. గుడ్డ సంచికే ముద్దు!

**ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి పర్యావరణాన్ని కాపాడుకుందాం**

**లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట్ నూతన టీం ప్రమాణ స్వీకారంలో జిల్లా గవర్నర్ విజయలక్ష్మి పిలుపు**



బాచుపల్లి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎం. విజయలక్ష్మి పిలుపునిచ్చారు. "ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచి ముద్దు" అనే నినాదంతో ప్రజల్లో పర్యావరణ చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట్ నూతన టీం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జిల్లా గవర్నర్ ఎం. విజయలక్ష్మి పాల్గొని గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు సమష్టిగా ముందుకు రావాలని కోరారు. రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి సెక్రటరీ లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణహిత కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్ ఎస్.ఎస్. శ్యామ్ కుమార్, రీజియన్ చైర్మన్ బి. విజయ్ రంగా, జోన్ చైర్మన్ సుధీర్ గౌడ్, జీఎంటీ కోఆర్డినేటర్ ప్రఫుల్ రెడ్డి, సెక్రటరీ లయన్ రామ్ మోహన్, లయన్ రేణుకా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు ప్రకటించారు.

## శక్తి స్కిల్ స్కీమ్‌ను రద్దు చేయాలి: పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన

?చౌటకూర్, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండలం శివంపేటలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు భారీ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'శక్తి స్కిల్ స్కీమ్'ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసనకు దిగారు.?ఈ సందర్భంగా విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ... పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను ఐటీఐ, ఒకేషనల్ కోర్సులతో విలీనం చేయడం వల్ల డిప్లొమా సర్టిఫికెట్ల ప్రాధాన్యత, విలువ తగ్గిపోయే ప్రమాదం ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలల్లో సాంకేతిక, ప్రాక్టికల్ నైపుణ్య శిక్షణ అందించడానికి బదులుగా, తమతో లేబర్ పనులు చేయిస్తున్నారని ఆరోపించారు.

?ప్రధాన డిమాండ్లు ఒ అభ్యంతరాలు:

?విలీన నిర్ణయం రద్దు: డిప్లొమా కోర్సులను ఇతర కోర్సులతో కలపడం ఆపాలి.? ఉన్నత విద్యకు రక్షణ: ఈ విధానం వల్ల ఇంజనీరింగ్ లేటరల్ ఎంట్రీ (ఈసెట్) అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున పాత విధానాన్నే కొనసాగించాలి.

? విద్యా సంవత్సరం నష్టం: ప్రభుత్వ నిర్ణయాల వల్ల విలువైన విద్యా సంవత్సరం వృథా కాకుండా స్పష్టమైన భరోసా కల్పించాలి.?విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాజు, జిల్లా హాస్టల్ కన్వీనర్ సాయికృష్ణ, సంగారెడ్డి నగర కార్యదర్శి ధనరాజ్, విద్యార్థి నాయకులు సతీష్, కళ్యాణి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## లింగాపూర్ ఎంపీడీవో పర్యవేక్షణలో ప్రజావాణి

లింగాపూర్,ఆగస్టు 17(విజన్ ఆంధ్ర )తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లింగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఎంపీడీవో,రాంచందర్ పర్యవేక్షణలో ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేసి పరిష్కరించుకోవచ్చు అని అధికారులు సూచించారు. ప్రజావాణి కోసం చేసిన ఏర్పాట్లపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రశంసా పత్రాలు పొందిన మున్సిపల్ సిబ్బందికి ఘన సన్మానం

పెబ్బేరు ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర ) :స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకున్న మున్సిపల్ సిబ్బందిని స్థానిక మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ గణేష్ ఘనంగా సన్మానించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మిథున్ కుమార్ రెడ్డి, పంపు ఆపరేటర్ ఎస్. రంజిత్ కుమార్, స్వీపర్ నరసమ్మలను శాలువాలు కప్పి అభినందించారు.

విధుల పట్ల అంకితభావంతో పనిచేసి అధికారుల నుంచి ప్రశంసా పత్రాలు సాధించడం అభినందనీయమని చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పట్టణ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ శివ సాయి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంత దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ గౌడ్ , సత్యనారాయణ, మోతే రాముడు, రాములు యాదవ్, యుగంధర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, రజక నరసింహ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతం

**- 9 ఫిర్యాదుల స్వీకరణ**

**- హాజరైన అన్ని శాఖల అధికారులు**




షాబాద్,ఆగస్టు 17(విజన్ ఆంధ్ర) : షాబాద్ మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ షాబాద్ (ఎంపీడీవో కార్యాలయం)లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించి రసీదులు అందజేశారు.

ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 7 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 2 దరఖాస్తులు కలిపి మొత్తం 9 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, తహసీల్దార్ ఎం.డి. అన్వర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ లక్ష్మీ రెడ్డి, మండల పంచాయతీ అధికారి నాసరయ్య, మండల వ్యవసాయ అధికారి విజయ చంద్ర, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, ఏఈ విద్యుత్ రవీందర్ నాయక్, ఏఈ గ్రిడ్, ఏఈ ఇరిగేషన్, మెడికల్ ఆఫీసర్లు, పశుసంవర్ధక శాఖ డాక్టర్, ఏఈ హౌసింగ్, బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టల్ వార్డెన్లు, ఏఈఓలు, ఐసీడీఎస్ సూపర్వైజర్, కార్యాలయ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి షాది ముబారక్ రద్దుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

**- కొల్లాపూర్,, పెంట్లవెల్లి మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీరం**

కొల్లాపూర్ /పెంట్లవెల్లి,ఆగస్టు 17 : (విజన్ ఆంధ్ర) : నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పెంట్లవెల్లి మండల కేంద్రాల్లో సోమవారం టిఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించిన ధర్నా కార్యక్రమాల్లో

కొల్లాపూర్ మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ,

కెసిఆర్ గారి పదేళ్ల పరిపాలనలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎగగొట్టేందుకు కుట్ర చేస్తున్నదని విమర్శించారు.కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్, రైతు బీమా పథకాలను ఇలా ఒక్కొక్కటి అన్ని సంక్షేమ పథకాలను కేసుల సాకు చెప్పి ఎగగొట్టేందుకు కుట్ర పన్నుతున్నారు. ఒకవేళ పథకాలు అమలైతే కెసిఆర్ గారికి పేరు వస్తుందని ఆపే కుట్ర పన్నుతున్నారు.

కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలకు ఒక అడ్వకేట్ హైకోర్టు లో కేసు వేస్తే ముఖ్యమంత్రి గారి వద్దనే న్యాయశాఖ పెట్టుకొని ప్రభుత్వం నుండి కౌంటర్ దాఖలు కూడా చేయలేని అధ్వాన పరిస్థితిలో ప్రభుత్వం ఉంది .రైతు భీమా పథకానికి ఒక ఏడాదికి దాదాపుగా 700 కోట్లు భీమా ప్రీమియం కట్టకుండా రైతులను మోసం చేసి రైతు భీమా పథకాన్ని ఎగగొట్టేందుకు కుట్ర చేస్తున్నదని విమర్శించారు.



24 గంటలు కరెంట్ ఇస్తున్నామని చెపుతున్నారు , ఎక్కడైనా చర్చ పెడదాం 24 గంటలు కరెంట్ ఇస్తున్నట్లైతే మేము ముక్కు నేలకు రాస్తాం , నిరూపించకపోతే మీరు మంత్రి పదవికి రాజీనామా చేస్తారా అని ఘాటుగా విమర్శించారు. నమోజ్ కట్ట వెడల్పుకు డబ్బులు శాంక్షన్ చేయించి జి ఓ ఇప్పిస్తే, 3 సంవత్సరాలైనా ఇంత వరకు చెరువు కట్ట పనులు పూర్తి చేయలేదు అని. ఇటువంటి మంత్రి అధికారంలో ఉన్నా ఒకటే ? లేకున్నా ఒకటే అని? ఘాటుగా విమర్శించారు.

ఈ కార్యక్రమంలో మండలల బి ఆర్ యస్ సర్పంచ్ లు , ఉప సర్పంచ్ లు మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలు ఏదీ..? కాంగ్రెస్‌పై 'గులాబీ' సమరభేరి..!

**- చిన్నంబావిలో హోరెత్తిన బీఆర్ఎస్ నిరసన ర్యాలీ, ధర్నా**

**- సాగునీరు, కరెంట్ కోతలు, పెండింగ్ సంక్షేమాలపై తీవ్ర ధ్వజం**

**- రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు**

చిన్నంబావి,ఆగస్టు17:(విజన్ ఆంధ్ర) : ఎన్నికల వేళ ఇచ్చిన అభయహస్తం హామీలను విస్మరించి, రైతాంగాన్ని, ప్రజలను తీవ్ర అగాధంలోకి నెట్టేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట పట్టింది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో సోమవారం మాజీ శాసనసభ్యుడు బీరం హర్షవర్ధన్ రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా రోడ్డుపై బైఠాయించి గులాబీ దండు హోరెత్తించిన నినాదాలతో చిన్నంబావిలో మారుమోగాయి. ధర్నా నిర్వహిస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో మండల కేంద్రంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

**– ఎండిపోతున్న పంట పొలాలు.. పెరిగిన విద్యుత్ కోతలు..!**

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రైతాంగం తీవ్ర అన్యాయానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "గత బీఆర్ఎస్ హయాంలో చివరి ఎకరా వరకు సాగునీరు పారేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేశాం. ప్రస్తుతం ఎలినినో ప్రభావం ఉండగా కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్ల కాల్వల్లో నీరు సరిగా రాక కింది ఆయకట్టు పంట పొలాలు ఎండిపోతుంటే రైతులు నీళ్ల కోసం అల్లాడిపోతున్నారు. కేసీఆర్ పాలనలో నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అప్రకటిత విద్యుత్ కోతలతో రైతుల కడుపు కొడుతోంది" అని మండిపడ్డారు.

**– అందని 'కళ్యాణలక్ష్మి'.. నిలిచిన 'రైతుబీమా'..!**

ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదని బీరం ఆరోపించారు. నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలవాల్సిన 'కళ్యాణలక్ష్మి' పథకం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందక సాయం కోసం నిరీక్షించాల్సి వస్తోందన్నారు. కళ్యాణలక్ష్మితో పాటు ఇస్తామన్న తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. అలాగే నిలిచిపోయిన 'రైతుబీమా'ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**– 98 జీవో బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి**

గత ప్రభుత్వంలో 98 జీవో ద్వారా నిరుద్యోగులు, నిర్వాసితులకు కొంతవరకు న్యాయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం దానిని పూర్తిగా పక్కన పడేసిందని విమర్శించారు. 98 జీవో కింద రావాల్సిన శాశ్వత ఉద్యోగ అవకాశాలను వెంటనే కల్పించాలని, కలెక్టరేట్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న డిస్ట్రెస్డ్ పర్సన్స్, లస్కర్ పోస్టుల ఫైళ్లను వెంటనే పరిశీలించి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ప్రజా సమస్యలు తీరేంత వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ వెంకటరమణమ్మ, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మండల అధ్యక్షుడు ఈదన్న, సర్పంచ్‌లు శరత్ రెడ్డి, శంకర్, నాయకులు దేగ శేఖర్, రంజిత్, వడ్డెమన్ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ లక్ష్మీ కురుమయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# మేస్త్రి జనార్ధన్ సాగర్‌కు ఘన నివాళి

కొత్తకోట ఆగస్టు 17 ( విజన్ ఆంధ్ర) : కొత్తకోట :పట్టణానికి చెందిన మేస్త్రి పి జనార్ధన్ సాగర్ కు అంబ భవాని తాపీ కార్మిక సంఘం సిఐటియు ఘన నివాళులు అర్పించడం జరిగింది మేస్త్రి ఆదివారం నాడు మరణించారు సోమవారం నాడు అంబా భవాని తాపీ కార్మిక సంఘం ద్వారా కుటుంబానికి పదివేల రూపాయలు నగదును ఆర్థిక సహాయం అందించడం జరిగింది ముందుగా భవన నిర్మాణ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీగా ఆయన ఇంటి దగ్గరకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా అస్కాన్ శ్రీనివాసులు నాగరాజు మాట్లాడుతూ పి జనార్ధన్ సాగర్ తాపీ కార్మిక సంఘం అధ్యక్షులుగా పనిచేశారు అదేవిధంగా గ్రామ ఉపసర్పంచిగా కొనసాగించారు అని చెప్పారు అదేవిధంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసేవాడని వారు పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగడ సానుభూతిని తెలియ జేయడం జరిగింది ఈ కార్యక్రమంలో భావన నిర్మాణ తాపీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ భవన నిర్మాణ తాపీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కావలి చిన్న వెంకటయ్య తాపీ కార్మిక సంఘం సీనియర్ నాయకులు మాజీ అధ్యక్షులు అస్కాని శ్రీనివాసులు తెలంగాణ శ్రీను ఆశన్న గొల్ల వెంకటయ్య టౌన్ అధ్య క్షులు నాగరాజు కార్యదర్శి వెంకటేష్ కోశాధికారి శాంతన్న కురుమూర్తి అమ్మపల్లి రాములు రాజు భాస్కర్ ఆంజనేయులు ఈశ్వర్ కురుమయ్య శ్రీనివాస్ రెడ్డి రాములు చిర్ల వెంకటేష్ పి శేఖర్ బాలకృష్ణ కొత్తకోటభవన నిర్మాణ తాపీ కార్మిక సంఘం నాయకులు అందరూ పాల్గొనడం జరిగింది



# పాము కాటుతో ఎద్దు మృతి

లింగాపూర్ ఆగస్టు 17( విజన్ ఆంధ్ర ) లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన జాదవ్ రఘునాథ్ గల ఎద్దును రోజువారి వ్యవసాయ పనులను ముగించుకొని చేనులో ఎద్దును తన చేను శివారంలో కట్టేసి వేరే పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో ఎద్దు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది ఆ వ్యక్తి తీవ్ర దుఃఖ సముద్రంలో మునిగిపోయి కన్నీరు మున్నీరయ్యారు . ఎద్దు సుమారు వేల 40 వెలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అధికారులు నష్టపరిహారం అందించాలని ఆ వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు.

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు కీలకం

**-ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్**

ముధోల్:17ఆగస్టు:విజన్ ఆంధ్ర : గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాల ఎంతో కీలకమని ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ అన్నారు. సోమవారం మండలంలోని ముద్గల్ గ్రామంలో సర్పంచ్ మేకల అనురాధ గణపతి ఆధ్వర్యంలో రెండు సీసీ కెమెరాల ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భం గా ఎస్సై మాట్లాడుతూ మండలం లోని ఆయా గ్రామాల్లో సీసీ కెమెరా లను ఏర్పాటు చేసుకునేందుకు ముందు కు రావాలని అన్నారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, జనసం చారం అధికంగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పా టు చేయడం ద్వారా అనుమానా స్పద వ్యక్తులు, వాహనాల కదలికల ను సులభంగా గుర్తించవచ్చన్నా రు.సీసీ కెమెరాల నిఘాతో దొంగత నాలను అరికట్టడం జరుగుతుం దన్నారు. గ్రామ ప్రజలు కూడా భద్రతా చర్యల్లో భాగస్వాములై సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిం చాలని కోరారు. దీంతో సీసీ కెమెరా ఏర్పాటుకు కృషిచేసిన సర్పంచ్ మేకల అనురాధ గణపతిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లక్ష్మణ్, యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి.. షాదీ ముబారక్ అమలు చేయాలి

**నెన్నెలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా**

బెల్లంపల్లి ఆగస్టు 17 విజన్ ఆంధ్ర : కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నెన్నెల మండల కేంద్రంలోని కుష్ణపల్లి జంక్షన్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశాల మేరకు నిరసన ధర్నా చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను నిలిపివేయడం సరికాదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని నాయకులు అన్నారు. పథకాలను యథావిధిగా కొనసాగించి పేద కుటుంబాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.



ధర్నాలో నెన్నెల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పంజాల సాగర్‌గౌడ్, సర్పంచ్ ఎండీ ఇబ్రహీం, నాయకులు సింగర్ రామచందర్, సంతోషం ప్రతాప్, ఇందూరి రమేష్, జడి నారాయణ, తిరుపతి, భీమరాజుల శ్రీనివాస్, పూదర అంజిగౌడ్, మల్లేష్, భాస్కర్, ఆశన్నతో పాటు వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల పెళ్లిళ్లకు అడ్డంకులెందుకు..?

చేవెళ్ల, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా నిలిచిన కళ్యాణలక్ష్మీ – షాదీ ముబారక్ పథకం చెక్కుల పంపిణీపై కోర్టులో స్టే తీసుకురావడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. పేదల సంక్షేమానికి ఉపయోగపడే పథకం చెక్కుల పంపిణీని అడ్డుకోవడం సరికాదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మీ – షాదీ ముబారక్ పథకం ద్వారా పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సాయం అందుతుందని, అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందాల్సిన సమయంలో కోర్టులో స్టే తీసుకురావడం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలిచే ఈ పథకాన్ని ఎలాంటి అడ్డంకులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. చెక్కుల పంపిణీ వెంటనే చేపట్టాలి.. కోర్టులో తీసుకొచ్చిన స్టేను తొలగించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి కళ్యాణలక్ష్మీ – షాదీ ముబారక్ చెక్కులు వెంటనే అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. పేద ఆడబిడ్డల వివాహాలకు సంబంధించిన పథకాన్ని రాజకీయాలకు అతీతంగా కొనసాగించాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవో, చేవెళ్ల తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, నియోజకవర్గ మాజీ ఇంచార్జి దేశమల్ల ఆంజనేయులు, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎదిరె రాములు, ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మిట్ట వెంకట రంగారెడ్డి, బీఆర్ఎస్ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, మంగమ్మమల్లేష్, మైనార్టీ మండల నాయకుడు మహ్మద్ జావెద్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు, విద్యా వేత్త అంజన్ గౌడ్, నాయకులు విజయర్క క్షత్రియ, రామాగౌడ్, తలారి యాదయ్య, బేగరి అనిల్ కుమార్, బేగరి దశరథ్, ఉద్యమకారుడు శేరి రాజు, కడమంచి ఆనంద్, ఎన్కు జంగారెడ్డి, వాసుదేవ్ రెడ్డి, రాహుల్ రెడ్డి, మంగలి రాజు, అనంత్ రెడ్డి, నత్తి కృష్ణారెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, కసిరే వెంకటేష్,

శేరి శివారెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, కరుణాకర్ రెడ్డి, దర్శన్, రామకృష్ణ (ఆర్కే), ఊరెళ్ల మహమ్మద్ అసిఫ్, పృథ్వీ, సయ్యద్ మజాహర్, మహమ్మద్ దాతర్, ఖాలీద్, అత్తెల్లి భాస్కర్, నర్సింలు, శ్యామ్ రావు, శ్రీనివాస్ గౌడ్, కుమార్, తోట శేఖర్, ప్రభాకర్ రెడ్డి, మొక్రం రాజు, కుమార్, సాయినాథ్, చాకలి కృష్ణ, రామచంద్రయ్య, బాలు, ప్రశాంత్, బిఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు

**-నిద్దర పోతున్న ఆబ్కారీ ఆది కారులు.**

**-బెల్ట్ షాప్‌ల మామూళ్ల మాయ లో ఆబ్కారీ అధికారులు**

**-మండలంలో ఎస్సై మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, కిస్టాపురం,భీముని తండా తులస్య తండాలో దాడులు**

తొర్రూరు ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : తొర్రూరు మండలంలో స్టిక్కర్ తో లిక్కర్ వ్యాపారం చేసుకోమని వైన్స్ షాప్ యజమానుల మాయ లో తొర్రూరు ఆబ్కారీ శాఖ అధికారులు వారిచ్చే మామూళ్ల. తో నిద్ర పోతున్న అధికారులు. ప్రతి పల్లెలో తాగ దానికి నీళ్ళు ఇవ్వకున్నా మందు దొరికే షాప్‌లు వీధి కి రెండు ఉన్నాయంటే ఆబ్కారీ శాఖ పని తనం ఎట్లా ఉందో అర్థం అవుతుంది.వైన్స్ పక్కన పర్మిషన్ రూమ్ లో మందు బాబులు కూసో దానికి కుర్చీ లేకున్న బెల్ట్ షాప్ లో కుర్చీ గ్లాస్ పెట్టు కోడానికి బల్లా పక్కా.

-గుడుంబా నివారణ లో పోలీస్ ల ది పై చెయ్యి

తొర్రూరు మండలం లో గుడుంబా నివారణ లో ఆబ్కారీ అధికారుల వైఫల్యం.తొర్రూరు పోలీస్ లు 10 రోజుల లో మూడు ఊర్ల లో కిస్టాపురం,భీముని తండా , తులస్య తండా ల లో మెరుపు,దాడులు,చేసి,గుడుంబా,బెల్లం పానకం ధ్వంసం చేసి కేసు లు నమోదు చేయడం పోలీసుల పనితీరుకు నిదర్శనం.

చట్టవ్యతిరేక బెల్ట్ షాప్ ల పై పోలీస్ లు చర్యలు తీసుకోవాలి మహిళా లోకం

తొర్రూరు మండలం లోని అన్ని గ్రామాల లో బెల్ట్ షాప్ లునడిపిస్తున్న,యాజమానుల పై,మెరుపు దాడులు నిర్వహించి చట్ట వ్యతిరేక వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని తొర్రూరు మండల మహిళా మణులు పోలీసులనుఅభ్యర్థిస్తున్నారు..బెల్ట్ షాప్ ల తో కుటుంబాలుఆగమవుతున్నాయని ,ఒక్క బాటిల్ పై,20 రూపాయల నుండి 100 రూపాయల వరకు మా కుటుంబాల జేబుకు చిల్లు పడుతుందని, మహిళలు పోలీస్ ల నువేడు కొంటున్నారు.

,లిగుడుంబా తయారీ కి పంచదార వాడకం తో పంచదారకు రెక్కలు.

గుడుంబా తయారీదారులు బెల్లం బదులు పంచదార వాడటం వలన పంచదార కు రెక్కలు వచ్చాయని 45 రూపాయలు ధర పలకని పంచదార గుడుంబా తయారీతో మార్కెట్లో 55 రూపాయలకుచేరిం దని,ఇది ప్రభుత్వంఓ ఆలోచించాల్సిన, విషయం. సామాన్య, ప్రజలకుధర, అందుబాటులో లేకుండా చేస్తున్న ఈ వ్యవస్థను అధికారులు పర్యవేక్షించాలి. పంచదార దిగుమతులపై, నియంత్రించాలి. బెల్లం వాడకం తగ్గి పంచదార,వాడకం,పెరిగినది దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

ఊరుకో వైన్ షాప్ అన్న ఇస్తే యం ఆర్ పి ధర్ కు వస్తుంది లేదా బెల్ట్ షాపులను మూయించండి.

-తులస్య తండాలో గుడుంబా నిర్మూలన పై అవగాహన సదస్సు

తుల్య తండాలో గుడుంబాస్థావరాల ను నిర్మూలించి, అక్కడి మహిళలకు గుడుంబా నివారణ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి గుడుంబా తయారీని మానుకొని గుడుంబా నుండి మీ కుటుంబాలను మీరే బాగు చేసుకోవాలని పిల్లలను మంచిగా చదివించుకొని వారి జీవితాలను బాగు చేయాలని డ్రగ్స్ కు మీ కుటుంబాలను పిల్లలను దూరంగా ఉంచి మంచి బాధ్యత అందించే బాధ్యత మీమహిళలకే,సాధ్యపడుతుందని గుట్కా డ్రగ్స్ ఒంటి ఆరోగ్యాన్ని క్షీణించే పదార్థాలను మీ కుటుంబాలకు దూరంగా ఉ ంచాలని ఎస్సై మహేందర్ రెడ్డి మహిళలను కోరారు.

# పేదింటి ఆడబిడ్డలకు పథకాలను కొనసాగించాలి



వాజేడు,ఆగస్టు17(విజన్ ఆంధ్ర): పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని బిఆర్ఎస్ పార్టీ వాజేడు మండల అధ్యక్షులు పెనుమల్లు రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం వాజేడు ఎంపీడీవో ఆఫీసులో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి, కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూడా ఈ పథకాలను కొనసాగించారని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పు సాకుతో ఈ పథకాలను రద్దు చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో కౌంటర్ వేయకుండా పేద ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ఈ పథకాలను రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నూగురు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య,కొత్తగట్టు సాంబమూర్తి, ముడిగ తిరుపతి, ఆదినారాయణ, సతీష్, షేక్ నిజాముద్దీన్, వెంకటరెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

# 'కేసీఆర్ పథకాలను చెరపలేరు'

## - చైర్ పర్సన్ సంధ్యారాణి

మందమర్రి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను చెరపలేరని క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి తెలిపారు. సోమవారం మందమర్రి ఎమ్మార్వో కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలంటూ ఎమ్మార్వో సతీష్ కుమార్ శర్మకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజా రమేష్,కౌన్సిలర్ భూమయ్య,స్వర్ణలత,సీనియర్ నాయకులు సుదర్శన్ గౌడ్,కుమార్,అనిల్ రావు,సతీష్,
కుమార్,అబ్బాస్,తిరుపతి రెడ్డి,సూరిబాబు,మల్లేష్,సురేందర్,
కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాగుల పంచమికి లోకారి కేలో ఘనంగా ఉయ్యాల పూజలు



గాదిగూడ,ఆగస్టు17(విజన్ ఆంధ్ర):నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని లోకారి కే గ్రామంలో ఉయ్యాల కార్యక్రమాన్ని ప్రత్యేక పూజలతో ఘనంగా ప్రారంభించారు. సంప్రదాయ ఆచారాలను పాటిస్తూ నిర్వహించిన పూజా కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొని నాగదేవతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉయ్యాలకు ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని నాగదేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో జడే శివాజీ ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ మండల అధ్యక్షుడు, ఆత్రం సంతోష్,మెస్రం రాము,మండాడి రాజు,పెందోర్ నాని,ప్రహలాద్, రవి జడే,తదితరులు పాల్గొన్నారు

# పది రోజులైనా స్పందనేదీ?

- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై సీపీఐ ఆగ్రహం
- వినతిపత్రం ఇచ్చినా చర్యలు శూన్యం.. కబ్జాదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని ఆరోపణ
- తాత్కాలిక నిర్మాణాలు కాస్తా శాశ్వత కట్టడాలుగా మారుతున్న వైనం
- గతంలో కూల్చిన స్థలాల్లోనే మళ్లీ నిర్మాణాలు.. అధికారుల తీరుపై ప్రజా సంఘాల మండిపాటు
- జగద్గిరిగుట్ట ఆలయ స్థలాల పరిరక్షణకు సీపీఐ ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ



జగద్గిరిగుట్ట, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర): జగద్గిరిగుట్ట డివిజన్‌లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూకబ్జాలపై ఫిర్యాదులు, వినతిపత్రాలు అందజేసి పది రోజులు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూములు, ఆలయ స్థలాలను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లో భూకబ్జాలపై సీపీఐ నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు కలిసి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారని ఉమా మహేష్ తెలిపారు. వినతిపత్రం స్వీకరించిన సమయంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. అధికారుల తాత్సారం కారణంగా కబ్జాదారులకు మరింత సమయం లభిస్తోందని, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను క్రమంగా శాశ్వత నిర్మాణాలుగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. గత కొద్ది రోజులుగా కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో భూకబ్జాలు మరింత పెరుగుతున్నాయని, గతంలో అధికారులు కూల్చివేసిన స్థలాల్లో సైతం మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. "అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నా అధికారులు స్పందించకపోవడం వల్లే కబ్జాదారుల ఆగడాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు, ఆలయ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంది. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉంది" అని ఉమా మహేష్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా జగద్గిరిగుట్ట ఆలయ స్థలాలకు సంబంధించిన భూములను పరిరక్షించేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులను ఏకం చేసి త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. భూకబ్జాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ నిర్మాణాలను తొలగించి, ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టి, అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూకబ్జాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# యాప్ బుకింగ్ వద్దు.. పాత పద్ధతే ముద్దు

- రైతులకు శాపంగా మారిన ఎఫ్ఎఫ్ఎస్ యూరియా బుకింగ్ యాప్
- పాత పద్ధతిలోనే ఫింగర్‌ప్రింట్ ద్వారా ఎరువులు అందించాలని రైతుల విజ్ఞప్తి

మర్పల్లి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : రైతులకు ఎరువులు సులభంగా అందించాల్సిన ఎఫ్ఎఫ్ఎస్ యూరియా బుకింగ్ యాప్ ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు పండించే రైతుల్లో చాలామంది నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని వారు ఉండటంతో యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవడం వారికి పెద్ద సమస్యగా మారింది. యాప్‌లో యూరియా బుక్ చేసుకోవాలంటే ముందుగా రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. ఆధార్ కార్డు నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాల్సి ఉండగా, పలుమార్లు ఓటీపీ విఫలమవుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. యాప్‌లో బుకింగ్ ప్రక్రియ ఎలా చేయాలో తెలియక చాలామంది రైతులు అయోమయానికి గురవుతున్నారు. తమకు యాప్‌లో బుకింగ్ చేసుకోవడం రాకపోవడంతో తెలిసిన వారి వద్దకు వెళ్లి సహాయం కోరుతున్నామని, అయితే కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. బుకింగ్ కావడం లేదంటూ వ్యవసాయ అధికారులను ఆశ్రయిస్తున్నప్పటికీ తమ సమస్యలకు సరైన పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షాభావంతో ఇప్పటికే ఆందోళనలో రైతులు**

అసలే వర్షాలు సకాలంలో కురవక పంటలు దెబ్బతింటాయనే ఆందోళనలో ఉన్న రైతులకు, మరోవైపు యూరియా వంటి ఎరువులు సకాలంలో అందకపోవడం మరింత భారంగా మారిందని పేర్కొంటున్నారు. ఎరువుల కోసం రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పాత పద్ధతినే అమలు చేయాలి**

రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎఫ్ఎఫ్ఎస్ యాప్ బుకింగ్ విధానాన్ని తొలగించి, గతంలో మాదిరిగా రైతుల వేలిముద్ర (ఫింగర్‌ప్రింట్) ఆధారంగా ఎరువులు అందించే విధానాన్ని అమలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సాంకేతికత పేరుతో తమపై అదనపు భారం మోపకుండా, ప్రతి రైతుకు సులభంగా ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# చింతకుంటపల్లిలో రోడ్డుకు మరమ్మతులు

విజన్ ఆంధ్ర కేశంపేట18 మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామ రోడ్డు వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. చింతకుంటపల్లి గ్రామం నుంచి కొండారెడ్డిపల్లి వరకు ఉన్న రహదారి వర్షాలకు పాడవటంతో పాటు గ్రామ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ పోచమని రమేష్ యాదవ్ రోడ్డుకు మట్టి వేయించి మరమ్మతులు చేయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. రహదారి

# హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ లో ఖాళీ సీట్లకే స్పాట్ అడ్మిషన్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగష్టు 17 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ సంవత్సరం 2026-27లో ఖాళీగా ఉన్న సిట్లకై బిటెక్ కోర్సులలో స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బీటెక్ చదువుకునే అర్హులైన విద్యార్థుల కొరకై హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఈ,ఏఐ, ఈసీఈ, ఐటి 2026-27 విభాగంలో ఖాళీగా ఉన్న సీట్లకి విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నందున ఈ అవకాశాన్ని సీట్లు రాని అర్హులైన విద్యార్థులు ఈ నెల 17 నుండి 19 తేదీలోపు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## ఆర్మూర్ పట్టణంలోని భార్గవి విద్యానికేతన్ హైస్కూల్లో మన ఊరు మన బాధ్యత సదస్సు..



ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ డివిజన్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ముఖ్యంగా మత్తు పదార్థాల నిర్మూలన డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని వాటి వల్ల జరిగే నష్టాలను వివరించారు ట్రాఫిక్ నియమాలు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలి మైనర్ లు డ్రైవింగ్ చేయకూడదు సైబర్ నేరాలు ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి అపరిచిత లింకులను క్లిక్ చేయకూడదని షీ టీమ్స్ విద్యార్థినిల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మరియు సి టీమ్స్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థిని విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు ..

## మగ్దుంపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా బహుమతుల ప్రదానం

**- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు**

నంగునూరు మండలం ఆగస్టు 17 విజన్ ఆంధ్ర స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం ఉదయం బహుమతులు అందజేశారు. రాంపూర్ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి అందించిన ఆర్థిక సహాయంతో విజేతలకు బహుమతులు అందించారు.

మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మగ్దుంపూర్ సర్పంచ్ పాకాల శ్రీనివాస్, రాంపూర్ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు వాసరి యాదమల్లు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా మగ్దుంపూర్ సర్పంచ్ పాకాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సమాజం కలిసి ముందుకు రావాలని ఆకాంక్షించారు.

రాంపూర్ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తున్నానని తెలిపారు. ముఖ్యంగా పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తానని ప్రకటించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

సీనియర్ నాయకుడు వాసరి యాదమల్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉందని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగగలరని అన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అన్నారు. విజేతలకు బహుమతులు అందించి ప్రోత్సహించిన రాంపూర్ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డికి పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, జీడిపల్లి సురేందర్ రెడ్డి, దుద్దెడ పరశురాములు, బైరు సత్తయ్య, దీకొండ గోవర్ధన్, అదిరాల సాయినాథ శర్మ, ముస్కీరు రాజయ్య, తడకంటి రాజు, అనరాజు స్వప్న, రాంపూర్ పంచాయతీ సభ్యుడు వెంకటేశ్, కడారి అమరేందర్ రెడ్డి, వస్సరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దవెల్లి గ్రామం లో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం పాల్గొన్న సర్పంచ్ భాస్కర్ గౌడ్

కేశంపేట విజన్ ఆంధ్ర 18 మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇద్దరమ్మా ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ అన్నారు గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు ఘనంగా గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ పేదల సమితి కాదు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గృహప్రవేశ కార్యక్రమంలో గ్రామ ప్రజలు లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

## నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు

కుల్కచర్ల, ఆగస్టు, 17(విజన్ ఆంధ్ర): నాగుల చవితి సందర్భంగా కుల్కచర్ల మండల ప్రజలు నాగ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కుల్కచర్లలోని నాగ దేవతల దేవాలయం దగ్గర ఉదయం నుంచే సందడి కనిపించింది. ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి నాగ దేవతలకు పూజలు జరిపించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పుట్టలో పాలు పోసి తమ కోరికలు నెరవేరాలని నాగ దేవతలను స్మరించుకున్నారు. నాగ చవితి రోజున దేవతలకు పూజలు జరిపించడం ద్వారా సకల దోషాలు తొలగిపోయి, మంచి జరుగుతుందని చెప్పారు. అందుకే ఈ పవిత్రమైన రోజున నాగ దేవతలను పూజించడం ఆనవాయితీగా వస్తోందని పలువురు మహిళలు తెలియజేశారు.



## 'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం'


మందమర్రి, ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించిన డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. లబ్ధిదారులు నుంచి నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే మంచి నీరు,డ్రైనేజీ కాలువలు,సీసీ రోడ్ వంటి అభివృద్ధి పనులను మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు,కౌన్సిలర్లు పల్లె శ్రీదేవి,గుర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.



## 34 వార్డుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి...

**- బ్లీచింగ్, క్లోరినేషన్, ఫాగింగ్ చేయాలి..**

**- ఎంసీపీఐయూ వెంకటేష్**



బెల్లంపల్లి, ఆగస్టు 17 విజన్ ఆంధ్ర : వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణంలోని 34 వార్డుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు క్లోరినేషన్ చేయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలని కోరారు.

మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం, చెత్త పేరుకుపోవడం వల్ల దోమల బెడద పెరుగుతోందని అన్నారు. దోమల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు.

పట్టణంలో పలుచోట్ల తినుబండారాల బండ్లు ఏర్పాటు చేసి పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని వెంకటేష్ ఆరోపించారు. అధికారులు తినుబండారాలపై తనిఖీలు నిర్వహించి నాణ్యత లేని పదార్థాలు, కల్తీ నూనెల వినియోగంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం ఆహార భద్రతపై పర్యవేక్షణ లోపానికి కారణమవుతోందని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 34 వార్డుల్లో బ్లీచింగ్, క్లోరినేషన్, ఫాగింగ్ నిర్వహించడంతో పాటు ఆహార విక్రయాలపై నిఘా పెంచాలని పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ రాస్తా రోఖో నిర్వహించిన పాలిటెక్నిక్ విద్యార్థులు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర ఆగస్టు 17 : ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని జి.ఓ నం.97 రద్దు కోరుతూ సాంకేతిక విద్యా వ్యవస్థ పరిరక్షణకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఏబీవీపీ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల వల్ల పాలిటెక్నిక్ కళాశాలలు దెబ్బతినే అవకాశం ఉన్నందున ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగిస్తూ పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు అనేవి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు అందుబాటులో ఉండే ఒక చక్కని నాణ్యమైన విద్యావ్యవస్థ అలాంటి ఈ సాంకేతిక విద్యను ప్రైవేట్ సంస్థల్లో విలీనం చేసి ఇంజనీర్ కావాలనే వారి కలల్ని దూరం చేసి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పాలిటెక్నిక్ కళాశాలలు అద్భుతంగా కొనసాగుతున్నాయని, విలీనం చేయడం కాకుండా మరింత బలోపేతం చేసి మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక కోర్సులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల అనుసంధానం మరియు మెరుగైన ప్లేస్‌మెంట్లు కల్పించాల్సింది పోయి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో



"శక్తి "అనే విభాగంలో చేర్చి ఉన్నత విద్యకు లక్షల మంది విద్యార్థులను దూరం చేసి నిధులను దారిమళ్లించే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తుంది. ప్రభుత్వం వెంటనే జి .ఒ. 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ కళాశాలలను యధావిధిగా కొనసాగించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిరసన కార్యక్రమాలు నిర్వహించి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్, జిల్లా ఎస్.ఎఫ్.డి జిల్లా కన్వీనర్ చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాహుల్, నగర కార్యదర్శి రాజు, నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, మేఘన, రవళి, సంధ్య మరియు వందలాది విద్యార్థులు పాల్గొన్నారు.



# జటా శంకర ఆలయం వద్ద అన్నదానం

ముధోల్:17ఆగస్టు:విజన్ ఆంధ్ర. ముధోల్ : మండల కేంద్రంలోని బొగడ వాడకట్టు కు చెందిన మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జటా శంకర ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రావణ సోమవారం పురస్కరించుకుని ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలను చేసి చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పుష్కలంగా పండి ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## మృతుడి కుటుంబానికి అండగా పొదుపు సంఘం.. రూ.80 వేల సాయం

**- అనారోగ్యంతో మృతి చెందిన సభ్యుడి భార్యకు క్లెయిమ్ మొత్తం అందజేత**

**- అభయనిధి, ఇన్సూరెన్స్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం**

నంగునూరు మండలం ఆగస్టు 17 విజన్ ఆంధ్ర: పొదుపు సంఘాల్లో సభ్యత్వం పొందిన కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా సంఘాలు పనిచేస్తున్నాయని పురుషుల పొదుపు సంఘాల సమితి అధ్యక్షుడు కదారి తిరుపతి రెడ్డి అన్నారు. సభ్యుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అభయనిధి, ఇన్సూరెన్స్ పథకాలు మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నంగునూరు గ్రామానికి చెందిన రాగీరు బాలరాజు నంగునూరు పురుషుల పొదుపు సంఘంలో సభ్యుడిగా కొనసాగుతూ గత ఏప్రిల్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. సంఘం నిబంధనల ప్రకారం ఆయన నామినీగా ఉన్న భార్య రాగీరు రాజేశ్వరికి రూ.80 వేల క్లెయిమ్ మొత్తాన్ని అందజేశారు. ఇందులో అభయనిధి కింద రూ.10 వేలు, ఇన్సూరెన్స్ కింద రూ.70 వేలు కలిపి మొత్తం రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కదారి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ పురుషుల పొదుపు సంఘాల ద్వారా సభ్యుల్లో పొదుపు అలవాటును పెంపొందించడంతో పాటు, అనుకోని ఆపదలు ఎదురైనప్పుడు వారి కుటుంబాలకు అండగా నిలిచేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. సభ్యుడు మృతి చెందిన సమయంలో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అభయనిధి, ఇన్సూరెన్స్ పథకాలు ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ప్రతి సభ్యుడు సంఘం అందిస్తున్న భద్రతా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నంగునూరు పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు రాజపేట గోపాల్ మాట్లాడుతూ సభ్యుల కుటుంబాలకు అవసరమైన సమయంలో సంఘం అండగా ఉంటుందని తెలిపారు. సభ్యత్వంతో పాటు పొదుపు, పరస్పర సహకారం, కుటుంబ భద్రతకు సంఘాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఆరె శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు దేవులపల్లి నర్సింగరావు, మల్లేశం, మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. రూ.80 వేల ఆర్థిక సహాయం అందుకోవడంతో రాగీరు రాజేశ్వరి సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుడి మృతితో కుటుంబానికి ఏర్పడిన ఆర్థిక లోటును కొంత మేర పూడ్చుతూ నంగునూరు పురుషుల పొదుపు సంఘం తమ సభ్యుల కుటుంబాలకు భరోసాగా నిలిచింది.

# బాల్కొండ లో ఉచిత ఆవు పాల పంపిణి

బాల్కొండ(నిజామాబాదు జిల్లా) విజన్ ఆంధ్ర ఆర్. సి. ఆగస్ట్ 17:- నిజామాబాద్ జిల్లా ఇందూరు గోసేవా సమితి బుసం సత్యనారాయ ణ ఆధ్వర్యంలో బాల్కొండ లో ఉచిత ఆవుపాల పంపిణి కార్యక్రమం జోరుగా కొనసా గింది. ప్రతి సంవత్సరం నాగుల పంచి మరో రోజు బాల్కొండ ఇత్వర్పేట్, నాగపురం గ్రామ భక్తులకు ఉదయం 7 నుండే 9 వరకు వంద ఇరవై లీటర్ల ఆవుపాలను ఉచితంగా పంపిణీ చేసారని అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి అధ్యక్షులు బుసం సత్యనారాయణ తెలిపారు. బాల్కొండ లో ఇలాంటి కార్యక్రమము గత ఐదు సంవత్సరాల నుండి కొనసాగుతుందని స్థానిక న్యాయవాది సిరియల జగన్,మెడికల్ సత్యనారాయణ తెలుపుతూ పాల పంపిణి దారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఇదిలా ఉండగా గతంలో వీళ్ళ నాన్నగారైన భూసం రాములు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం విశేషమని, అలాగే బాల్కొండలో స్వయంభు లింగమయ్యా ఆలయంలో ప్రతి ఉగాది ఉగాది రోజునుండి (05) రోజులపాటు ఉ చితంగా అన్నదాన కార్యక్రమాలు కూడా భూసం సత్యనారాయణ కుటుంబం తరపున నిర్వహించడం విశేషంగా ఉందని అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి కార్యనిర్వాహా అధ్యక్షులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు వివరించారు.




# శివంపేటలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని రైతుల వినతి

**- సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌కు వినతిపత్రం అందజేశారు**

చౌటకూర్: ఆగస్టు 17 :సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 207లో రైతుల నకబాటను కాపాడటంతో పాటు, మంజీరా నది పరివాహక ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌కు వినతిపత్రం అందజేశారు.రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే అంశంపై గతంలో ఆగస్టు 7న సంబంధిత అధికారులకు ప్రత్యక్షంగా, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నీటిపారుదల (ఇరిగేషన్) శాఖ అధికారులు ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.సర్వే నంబర్ 207 గుండా వెళ్లే నకబాటను కాపాడి రైతులకు న్యాయం చేయాలని, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే సదరు సర్వే నంబర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందో లేదో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, హద్దులు నిర్ణయించి అక్రమ నిర్మాణాలు, నాలాల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుపై త్వరితగతిన విచారణ జరిపి, ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే పరిశీలన చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు.

# చోర్గావ్ శివాలయంలో ఘనంగా నాగుల పంచమి ఉత్సవాలు

**వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. అలరించిన సంప్రదాయ నృత్యాలు**

నార్నూర్, ఆగస్టు 17(విజన్ ఆంధ్ర): మండలంలోని చోర్గావ్ శివాలయం (శ్రీ శ్రీ శ్రీ మూర్తి రాములు సంస్థాన్) కేంద్రంగా సోమవారం నాగుల పంచమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. తెలంగాణ, మహారాష్ట్రతో పాటు ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా మతుర లబాన్ సంప్రదాయ నృత్యాలు, ఆధ్యాత్మిక ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ వేషధారణలో కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సంస్థాన్ పీఠాధిపతి శ్రీ శ్రీ రామ్ మహారాజ్ భక్తులకు హితబోధ చేశారు. భక్తి, ధర్మం, ఆధ్యాత్మిక విలువలను పాటిస్తూ సమాజంలో ఐక్యతను పెంపొందించాలని సూచించారు. నాగుల పంచమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

గ్రామాల్లోనూ సంప్రదాయ వేడుకలు



నాగుల పంచమి సందర్భంగా నార్నూర్, గాదిగూడ మండలాల్లోని వివిధ గిరిజన గ్రామాల్లోనూ పండుగ సందడి నెలకొంది. గిరిజనులు తమ సంప్రదాయాలను పాటిస్తూ ఉయ్యాల ఊగుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. తరతరాలుగా వస్తున్న గిరిజన సంప్రదాయాలు, ఆచారాలను కొనసాగిస్తూ నాగుల పంచమి పండుగను ఘనంగా నిర్వహించడం ద్వారా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల వైభవం మరోసారి చాటిచెప్పారు.

# మద్యానికి బానిస అయి వ్యక్తి ఆత్మహత్య

లక్షట్ పేట ఆగష్టు 17( విజన్ ఆంధ్ర ) మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశం అను 55 సంవత్సరాల వ్యక్తి మద్యానికి బానిస అయి మద్యం మత్తులో పంటకు కొట్టే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని ఎస్ఐ గోపతి సురేష్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు రంగపేట గ్రామంలో పారిశుద్ధ కార్మికునిగా పనిచేస్తున్నారు. అతిగా మద్యం తాగడంతో ఈ నెల 15న భార్య మందలించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న పంటకు కొట్టే గడ్డి మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గం మధ్యలో సిద్దిపేట వద్ద చనిపోయాడు అతనికి భార్యా ఇద్దరు పిల్లలు ఉన్నారు భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



## ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై యువకుడి మృతి

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): బాలానగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాలానగర్‌లోని గురుకృప గ్లాస్, ప్లైవుడ్ , హార్డ్‌వేర్ షాపులో పనిచేస్తున్న సంజు చౌదరి (26) సోమవారం ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో కింద పడిపోయిన ఫ్లెక్స్ బోర్డును తొలగించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవాహానికి గురై తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.

గమనించిన అతని మేనమామ దయారామ్ చౌదరి వెంటనే సంజును బాలానగర్‌లోని బీబీఆర్ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఈ ఘటనపై మృతుడి తండ్రి చెనారామ్ చౌదరి బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మరణం పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగిందని, ఎలాంటి అనుమానాలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నా కోసం వెతకవద్దు అంటూ ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):

ఇంట్లో లేఖ రాసి వదిలేసి ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. వర్టెక్స్ సద్గురు కృప అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న తేజోమూర్తుల హర్షవర్ధన్ ఈ నెల 16న సాయంత్రం పనిమీద బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోగా, ఆయన తండ్రి తేజోమూర్తుల ఆనందరావు (72) ఇంట్లో కనిపించలేదు. అయితే ఇంట్లో ఒక లేఖతో పాటు తన మొబైల్ ఫోన్‌ను వదిలి వెళ్లినట్లు గుర్తించారు. లేఖలో నేను ఇంటిని వదిలి వెళ్తున్నాను. నా కోసం వెతకవద్దు. పోలీసులకు ఫిర్యాదు చేయవద్దు. నేను తిరిగి రాను. మీరంతా సంతోషంగా జీవించండి అని రాసి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన ఆనందరావు సుమారు 5 అడుగుల 4 అంగుళాల ఎత్తు, గోధుమ వర్ణ ఛాయ కలిగి ఉండి, ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఆకుపచ్చ, తెలుపు చారల చొక్కా, నల్ల ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కుమారుడు హర్షవర్ధన్ ఫిర్యాదు చేయడంతో కేపీహెచ్‌బీ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు దర్యాప్తు అధికారి హెడ్ కానిస్టేబుల్ వి. సంగయ్య- 8712567912 ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే రూ.5వేలు జరిమానా



ముధోల్:ఆగస్టు 17 :విజన్ ఆంధ్ర వ్యాపారస్తులు, దుకాణదారులు వాడితే రూ.500 నుండి 5వేల వరకు జరిమానాలు విధించడం జరుగుతుందని ముధోల్ ఎంపీవో శివకుమార్ అన్నారు.

సోమవారం మండల కేంద్రమైన ముధోల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణా నికి తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు కాలుష్యం పెరుగుతోందని పేర్కొన్నా రు.ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లకు బదులుగా క్లాత్ బ్యాగులు, కాగితపు సంచులు, పునర్వినియోగ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లం ఘించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి పాటుపడాలని అన్నారు

# ఆగస్టు 17ను హక్కుల సాధన దినంగా గుర్తించాలి

**-అంబేద్కర్ సాధించిన హక్కులను కాపాడుకోవాలి...**

**-దళిత సంఘాల ఐక్య వేదిక**



బెల్లంపల్లి, ఆగస్టు 17 విజన్ ఆంధ్ర : ఆగస్టు 17ను బహుజనుల హక్కుల సాధన దినంగా గుర్తించాలని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తాలో ఆయన విగ్రహంకు పూలమాల వేసిన దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు, అనంతరం బహుజనుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చిలుక రాజనర్సు మాట్లాడుతూ..

శతాబ్దాలుగా విద్య, సామాజిక గౌరవం, సమాన హక్కులకు దూరంగా ఉంచబడిన బహుజనులకు రాజ్యాంగం ద్వారా హక్కులు లభించాయని అన్నారు. నేడు బహుజనులు విద్యను అభ్యసిస్తూ వివిధ ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారంటే అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులే కారణమని పేర్కొన్నారు.

అంబేద్కర్ సాధించిన విద్య, రాజకీయ, సామాజిక హక్కుల ప్రాధాన్యాన్ని నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, రాష్ట్రపతి వరకు బహుజనులు వివిధ పదవులను చేపడుతున్నారంటే రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల ఫలితమేనని తెలిపారు.

1932 ఆగస్టు 17న కమ్యూనల్ అవార్డు ద్వారా అంబేద్కర్ బహుజనుల హక్కుల కోసం పోరాడిన చారిత్రక సందర్భాన్ని గుర్తుచేస్తూ.. ఆగస్టు 17ను హక్కుల సాధన దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ సాధించిన హక్కులను కాపాడుకోవడంతో పాటు వాటి ప్రాధాన్యాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాలని కోరారు.

కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి గోమాస రాజం, దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు బత్తుల రాజలింగు, కాసర్ల యాదగిరి, కారెంగుల మల్లేష్, దాసరి బానయ్య, కామెర దుర్గయ్య, భోగే రాజయ్య, గోగర్ల శేఖర్, బొంకూరి రామచందర్, కడపాక శంకర్, గద్దల ధర్మేంద్ర, కుమారస్వామి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాండూర్ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మరో కీలక అడుగు.

--మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి..



తాండూరు ఆగస్టు 17 (విజన్ ఆంధ్ర) కాగ్నా నుంచి తాండూర్‌కు తాగునీటి సరఫరా పథకానికి రూ.110 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం అధికారికంగా జీవో (+.ా. ౯. చీ. 788) విడుదల తాండూర్ మున్సిపల్ తో పాటు యాలాల్ మండలంలో దాదాపు 13 గ్రామాలకు శాశ్వత మంచినీటి సరఫరా అవుతుందని తెలిపారు.రూ.46 కోట్లతో మురుగునీరు కాగ్నా నదిలో కలువకుండా మురుగునీటి శుద్ధి కేంద్రం (సీవేజ్ పంప్)తో పాటు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణంకు కొనసాగుతున్న టెండర్ ప్రక్రియ, త్వరలో పనులు ప్రారంభం కానున్నయని తెలిపారు.తాండూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు బి. నాగరాజు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గారు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తాండూర్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాగ్నా నుంచి తాండూర్‌కు తాగునీటి సరఫరా పథకానికి రూ.110 కోట్లు మంజూరు చేయించడంలో తాండూర్ ఎమ్మెల్యే శ్రీ బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేశారని అన్నారు.టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులను ప్రారంభించి, త్వరితగతిన తాండూర్ ప్రజలకు కాగ్నా నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని, తాండూర్ ప్రజల చిరకాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా నిధులు మంజూరు చేసినందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు గారికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గారికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అదే విధంగా మురికినీరు నదిలో కలవకుండా అడ్డుకునే పంపు వ్యవస్థ సీవేజ్ పంప్ మరియు పైప్ లైన్ నిర్మాణానికి రూ.46.23 కోట్లతో టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని అతి త్వరలో సీవేజ్ పంపు నిర్మాణ పనులు కూడ ప్రారంభం అవుతాయని తెలిపారు... ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నాయకత్వంలో తాండూర్ నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల మాదిరిగా దూసుకపోతుందని హర్షం వ్యక్తం చేశారు.

ఈ మీడియా సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్,వైస్ చైర్మన్ ఖాసీం, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు సర్దార్ ఖాన్, మల్లన్న, కౌన్సిలర్స్ ఎల్లప్ప,బాలకృష్ణ రెడ్డి,ఉర్దూ ఘర్ చైర్మన్ జాలాల్, మైనార్టీ ప్రెసిడెంట్ ఫరీద్,నాయకులు, బోయ రవిరాజు,రాజు,శ్రీకాంత్,షేక్ వాసీం,ప్రహ్లాద్, అఖిల్ బాబా ల్యాఖాత్ అలీ,మహిళ నాయకులు రిజ్వాన తోపాటు పలువురు యువనాయకులు పాల్గొన్నారు.

# రూ.50.40 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన

మంజూరవుతున్నాయని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని అనేక కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించలేదని ఆయన విమర్శించారు. ప్రజల కనీస అవసరాలైన రోడ్లు, డ్రైనేజీ వంటి సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. ప్రస్తుత అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబులకు శ్రీశైలం గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి, కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వంతో సమన్వయంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు, స్థానిక నాయకులు సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేసిన శ్రీశైలం గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు రమేష్ మంజూల్కర్, కాజా, మోతే శ్రీనివాస్, షాకీర్, తిమ్మయ్య, గంజాయి రాములు, సాయి గౌడ్, మల్లం శీను, పాషా, మోయిన్ తదితరులతో పాటు కాలనీవాసులు కనకరాజు, విశ్వనాథ్, శ్రీనివాస్, ఆనంద్‌రావు, నిర్మలరాజు తదితరులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# “సామాజిక న్యాయానికి స్ఫూర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్-నేటి తరానికి రాజ్యాధికార చైతన్యం”



ఆగస్టు 18, 2026 మంగళవారం హైదరాబాద్ ట్యాంక్బండ్పై ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది.

సుమారు 376 సంవత్సరాల క్రితం, 1650 ఆగస్టు 18న తెలంగాణ గడ్డపై ఒక మహోన్నత వ్యక్తిత్వం ఆవిర్భవించింది. ఆయనే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.

సామాన్య కుటుంబంలో జన్మించి, తన కాలంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను ప్రశ్నిస్తూ, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

పాపన్న కేవలం ఒక యుద్ధ వీరుడు కాదు. కోటలను జయించిన సైనిక నాయకుడిగా మాత్రమే ఆయనను చూడటం ఆయన చారిత్రక ప్రాధాన్యతను పరిమితం చేయడమే అవుతుంది. గోల్కొండ కోటను ఏలిన బహుజన చక్రవర్తిగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలను సమీకరించి, అప్పటి ఆధిపత్య వ్యవస్థలను సవాలు చేసిన ప్రజా నాయకుడిగా ఆయన తెలంగాణ ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన గాథలో ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం, అధికారంలో భాగస్వామ్యం వంటి విలువలు అంతర్లీనంగా కనిపిస్తాయి.

పాపన్న నాటిన సామాజిక న్యాయ విత్తనం

17వ శతాబ్దంలోనే సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల ప్రజలను ఏకం చేసి తన పోరాటానికి పునాది వేసిన పాపన్న, అధికారం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండాల్సిన అవసరం లేదని తన కార్యాచరణ ద్వారా చాటిచెప్పిన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు.

ఆయన పోరాటం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది:
మనిషికి గౌరవం ఉండాలి.
అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడాలి.
అణగారిన వర్గాలకు అవకాశాలు కల్పించాలి.
అధికారంలో అందరికీ భాగస్వామ్యం ఉండాలి.

అందుకే నేటికీ బహుజన సమాజానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక చారిత్రక వీరుడు మాత్రమే కాదు; ఆత్మగౌరవానికి ప్రతీక, సామాజిక న్యాయానికి స్ఫూర్తి, సమానత్వానికి చిహ్నం.

గోల్కొండతో సహా అనేక కోటలపై తన ప్రభావాన్ని స్థాపించిన పాపన్న సైనిక ప్రతిభతో పాటు తన కాలంలోని రాజకీయ వ్యవస్థలను సవాలు చేసిన నాయకుడిగా చరిత్రలో నిలిచారు. ఆయనతో అనుబంధం ఉన్న ఖిలాషాపూర్ కోటను చారిత్రక వారసత్వ కట్టడంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టడం కూడా ఆయన చారిత్రక ప్రాధాన్యతకు నిదర్శనం.

నేటి సామాజిక న్యాయానికి పాపన్న ఆలోచనలు ఎందుకు అవసరం?

నేడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో సామాజిక న్యాయం గురించి విస్తృతమైన చర్చ జరుగుతోంది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రాతినిధ్యం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావిస్తున్నాయి.

అయితే సామాజిక న్యాయం కేవలం ఎన్నికల నినాదంగా మిగిలిపోకూడదు.
సామాజిక న్యాయం అంటే ప్రతి కులానికి సమాన గౌరవం.
సామాజిక న్యాయం అంటే అవకాశాల్లో సమానత్వం.
సామాజిక న్యాయం అంటే అధికారంలో తగిన ప్రాతినిధ్యం.
సామాజిక న్యాయం అంటే వనరులపై న్యాయమైన వాటా.
సామాజిక న్యాయం అంటే అణగారినవారికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు. ఈ విలువలు విధానాల్లో, పరిపాలనలో, బడ్జెట్ కేటాయింపుల్లో, విద్యా--ఉద్యోగ అవకాశాల్లో, రాజకీయ ప్రాతినిధ్యంలో ప్రతిబింబించినప్పుడే సామాజిక న్యాయానికి నిజమైన అర్థం వస్తుంది.

బహుజన సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది.
నిబద్ధత ఉంటే సాధించలేనిది లేదు.
పట్టుదల ఉంటే మార్పు సాధ్యమే.
ఐక్యత ఉంటే చరిత్రను మార్చగలం.
ఆత్మగౌరవం ఉంటే అన్యాయాన్ని ప్రశ్నించగలం.

పాపన్నలో ఉన్న నిబద్ధత, పట్టుదల, పోరాట స్ఫూర్తి, ఆత్మగౌరవం, అధికార భాగస్వామ్య ఆకాంక్షలను నేటి తరం అర్థం చేసుకోవాలి.
ఇది ఎవరినీ వ్యతిరేకించడానికి పిలుపు కాదు.
ఇది ఎవరిపైనా ద్వేషాన్ని పెంచడానికి పిలుపు కాదు.
ఇది ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన ప్రాతినిధ్యం సాధించేందుకు చైతన్యమయ్యే పిలుపు.
“మనం చేయకపోతే ఎవరు చేస్తారు?
ఇప్పుడు కాకపోతే ఎప్పుడు చేస్తాం?”
ఈ ప్రశ్నను ప్రతి బహుజన కుటుంబం, ప్రతి యువకుడు, ప్రతి విద్యార్థి, ప్రతి సామాజిక కార్యకర్త, ప్రతి ప్రజా ప్రతినిధి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

రాజ్యాధికారం అంటే బాధ్యత

నేటి ప్రజాస్వామ్యంలో “రాజ్యాధికారం” అంటే కేవలం అధికార కుర్చీని పొందడం కాదు.

ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం, ప్రజల కోసం విధానాలు రూపొందించడం, పరిపాలనలో భాగస్వామ్యం కావడం, విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఆర్థిక మరియు రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలను సాధించడం --- ఇవన్నీ ప్రజాస్వామ్య రాజ్యాధికారంలో భాగమే.

అందువల్ల బహుజన సమాజం విద్యలో, ఉద్యోగాల్లో, వ్యాపారంలో, రాజకీయాల్లో...

# “కళ్యాణ లక్ష్మి ఎత్తేస్తే ఊరుకోం”

**-కాంగ్రెస్ ప్రభుత్వంపై బీ=ూ నేతల ఫైర్ - కల్వకుర్తిలో భారీ ధర్నా**

**-“30 నెలల రావణ రాజ్యం” - నేతల ఆగ్రహ జ్వాలలు**

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 17:

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేస్తున్నందుకు నిరసనగా కల్వకుర్తిలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించాయి.

సోమవారం ఉదయం ఆర్డిఓ కార్యాలయం ఎదుట జరిగిన ఈ ధర్నాకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, కల్వకుర్తి బిఆర్ఎస్ మాజీ ఇంచార్జి విజితా రెడ్డి, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ గౌడ్ ప్రధానంగా హాజరై ప్రసంగించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జై తెలంగాణ! జై బిఆర్ఎస్ నినాదాలతో హోరెత్తించారు.

“36 నెలలుగా మోసం” – మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

“36 నెలల నుండి ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. ఇంకా ఎన్ని రోజులు మోసం చేస్తారు? ఇంకో రెండు సంవత్సరాలే ఉంది. ప్రజలు తెలివైనవారు. ఎన్నికలు వచ్చినప్పుడు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం” అని హెచ్చరించారు.



ఎన్నికల ముందు కెసిఆర్ 16 వేలు ఇస్తుంటే, మేము అధికారంలోకి వచ్చిన వెంటనే తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ 3 సంవత్సరాలు గడుస్తున్నా ఆడపిల్లలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. “ఆడపిల్లల ఉసురు పోసుకున్న వారు ఎవరూ బాగుపడరు” అన్నారు.

కెసిఆర్ పదేళ్ల పాలన “రామరాజ్యం” అని, ఇప్పటి 30 నెలల కాంగ్రెస్ పాలన “రావణ రాజ్యం” అని అభివర్ణించారు.

పథకాలు ఆపడం ద్రోహం–మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం

మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం ప్రసంగిస్తూ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద ఆడపిల్లలకు వరమని, వాటిని ఎత్తివేయడం కాంగ్రెస్ చేస్తున్న అతిపెద్ద ద్రోహమని అన్నారు.

“కెసిఆర్ గారు అమలు చేసిన ప్రతి పథకం వెనుక లక్షలాది కుటుంబాల ఆశలు ఉన్నాయి. వాటిని ఆపితే బిఆర్ఎస్ కార్యకర్తలు ఊరుకోరు. వీధిలోకి వచ్చి కొట్లాడతాం” అని స్పష్టం చేశారు.

“బంగారు తెలంగాణను నాశనం చేస్తున్నారు” – గోలి శ్రీనివాసరెడ్డి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ గారు 10 ఏళ్లలో రైతుబంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు.

“33 రాష్ట్రాలు కెసిఆర్ పథకాలను కాపీ కొట్టాయి. అలాంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ఆపేస్తోంది. ఇది ప్రజా వ్యతిరేక విధానం. ప్రజలు దీన్ని క్షమించరు” అని విమర్శించారు.

“ఆడబిడ్డల ఆక్రందనలు వినండి” – విజితా రెడ్డి

బిఆర్ఎస్ మాజీ ఇంచార్జి విజితా రెడ్డి ప్రసంగిస్తూ పెళ్లిళ్లకు డబ్బులు లేక ఎంతో మంది ఆడపిల్లల తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

“ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు అన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కళ్యాణ లక్ష్మి నిధులు విడుదల చేయాలి” అని డిమాండ్ చేశారు.

“కెసిఆర్ ఆనవాళ్లు చెరపలేరు”

నలుగురు నేతలు ఉమ్మడిగా మాట్లాడుతూ కెసిఆర్ జిల్లాలకు కొత్త కలెక్టరేట్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతో బంగారు తెలంగాణకు పునాది వేశారని, ఆయన ఆనవాళ్లను ఎవరూ చెరిపేయలేరని అన్నారు.”ప్రజాదరణ పొందిన పథకాలను తీసేయడం సరికాదు. వీళ్లు చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో గద్దె దిగడం ఖాయం” అని తేల్చి చెప్పారు.అనంతరం ఆర్డిఓ కార్యాలయం లో అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు నాయకులు సూర్య ప్రకాష్, గోవర్ధన్, మధు, సైదుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జరిగిన ఈ ధర్నా బిఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నేతల ప్రసంగాలతో కల్వకుర్తి ప్రాంగణం మార్మోగింది....